# తెలుగురాష్ట్రం

APTEL/2016/66202

తెలుగు దినపత్రిక

అమలాపురం | సంపుటి : 11 సంచిక : 85 | ఎడిటర్ : ఎ. రాజశేఖర్ | బుధవారం 29 జులై 2026 | పేజీలు 8 వెల : 5/-

published : Amalapuram Vol:11 Issue : 85 29-7-2026 Editor : A.RAJASEKHAR Pages : 8 Rs: 5/-


## సింహాచలం గిరి ప్రదక్షిణ..

### భారీ ఎత్తున పాల్గొన్న భక్తులు..!



**విశాఖపట్నం, (సింహాచలం), జులై 28 తెలుగురాష్ట్రం ప్రతినిది**
విశాఖపట్నంలోని ప్రసిద్ధ శ్రీ వరాహ లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానం సింహాచలంలో నిర్వహించిన గిరి ప్రదక్షిణ భక్తిశ్రద్ధల నడుమ ఘనంగా జరిగింది. వేలాది మంది భక్తులు తెల్లవారుజామునే సింహాచలం చేరుకుని స్వామివారి నామస్మరణతో గిరి ప్రదక్షిణలో పాల్గొన్నారు. కుటుంబ సమేతంగా వచ్చిన భక్తులతో ఆలయ పరిసరాలు ఆధ్యాత్మిక వాతావరణాన్ని సంతరించుకున్నాయి.

- తరువాయి 2లో..

# ఎల్ నినోతో ముప్పు..

## కష్టకాలంలో రైతులకు అండగా ఉండాలి



- ఎల్ నినో యాక్షన్ ప్లాన్ అమల్లో నిర్లక్ష్యాన్ని సహించను
- తాగునీటి సమస్య తలెత్తకూడదు
- ప్రతి పంటకు బీమా నమోదు చేయించే బాధ్యత కలెక్టర్లదే
- నిరంతరం మానిటరింగ్ చేసేలా ఎల్ నినో కంట్రోల్ రూమ్
- ఎల్ నినోపై క్షేత్ర స్థాయి అంచనాలు... ప్రణాళికలు ఉండాలి
- ఏడాదికి సరిపడా పశుగ్రాసం అందుబాటులో ఉండేలా ప్రణాళికలు
- ఎల్ నినోపై ఆర్ఎస్కేల స్థాయిలో ఇంప్లిమెంటేషన్ కమిటీలు
- ఆగస్టు 3 నుంచి ఎల్ నినోపై అవగాహన కార్యక్రమాలు

**అమరావతి, జులై 28 తెలుగురాష్ట్రం ప్రతినిధి**
ఎల్ నినో కష్టకాలంలో రైతులను ఆదుకోవాలని... వారికి సరైన సమాచారాన్ని సహకారాన్ని అందిస్తూ అండగా నిలవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. మంగళవారం రాష్ట్ర సచివాలయంలో ఎల్ నినో ప్రభావం, ప్రభుత్వ పరంగా తీసుకోవాల్సిన చర్యలు, రైతుల్లో కల్పించాల్సిన అవగాహనపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సమీక్షించారు. ఎల్ నినో ప్రభావం ఏ మేరకు ఉంటుంది... దీనికి సంబంధించిన యాక్షన్ ప్లాన్ వంటి అంశాలను సీఎం చంద్రబాబుకు అధికారులు వివరించారు. జూలై నెలలో 69 శాతం లోటు వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు. వచ్చే మూడు నెలల్లో సరాసరి 35 నుంచి 40 శాత మేర లోటు వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందన్న అధికారులు... జూన్ -- నవంబర్ మధ్య 844 మి.మీ వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా 551 మి.మీ మాత్రమే నమోదయ్యే అవకాశం ఉందని వివరించారు. అంచనాలకు మించి ఎల్‌నినో ప్రభావం ఉండబోతోందని అధికారులు తెలిపారు. ప్రస్తుతానికి ఉన్న అంచనాల ప్రకారం అన్ని జిల్లాల్లోనూ ఎల్‌నినో ప్రభావం చూపిస్తోందని, ఎక్కువగా పశ్చిమ గోదావరి, ప్రకాశం, అన్నమయ్య, కృష్ణా, కడప జిల్లాల్లో వర్షాభావ పరిస్థితులు నెలకొంటాయని అధికారులు చెప్పారు. 2.78 లక్షల హెక్టార్లలో పత్తి, 1.07 లక్షల హెక్టార్లలో వరిపై ప్రభావం చూపిస్తుందని అధికారులు తెలిపారు. శ్రీకాకుళం జిల్లా పరిధిలోనే వరి పంటకు ఎక్కువ నష్టం వాటిల్లే అవకాశం ఉందని ముఖ్యమంత్రికి వివరించారు. వంశధార నుంచి జలాలు అందుబాటులోకి వస్తే వాటిని సద్వినియోగం చేసుకుంటూ పంటలను కాపాడాలని సీఎం సూచించారు. రాష్ట్రంలో 122 హై రిస్క్ మండలాలను గుర్తించామని అధికారులు సీఎంకు వివరించడంతో... హై రిస్క్ మండలాల్లో బోరు ఆధారంగా పంటలను కాపాడుకునే అంశాన్ని పరిశీలించాలని ఆదేశించారు. ఆగస్ట్ 3 నుంచి అవగాహన కార్యక్రమాలు, వరికి ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి, అత్యవసర విత్తన ప్రణాళికను రూపొందించినట్లు అధికారులు తెలిపారు. కంది, ఆముదం, మినుము పంటలను ఇప్పటికే కొందరు ప్రత్యామ్నాయ పంటలుగా వేస్తున్నారని చెప్పారు. ఫసల్ బీమా యోజన, వాతావరణ ఆధారిత పంటల బీమా పథకం కింద

- తరువాయి 2లో..





## మోదీ పర్యటనకు

# భోగాపురం సిద్ధం

### భోగాపురం ఎయిర్‌పోర్ట్ ఏర్పాట్లపై కీలక సమీక్ష

**అమరావతి, జులై 28 తెలుగురాష్ట్రం ప్రతినిధి**
భోగాపురంలో అత్యంత వేగంగా నిర్మాణమైన అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయాన్ని ఆగస్టు 1వ తేదీన భారత ప్రధాని నరేంద్ర మోదీ ప్రారంభోత్సవం చేయనున్నారు. ఈ పర్యటనకు సంబంధించిన సమగ్ర ఏర్పాట్లపై రాష్ట్ర నారా లోకేష్ అధ్యక్షతన విజయనగరం జిల్లా భోగాపురం విమానాశ్రయ ప్రాంగణంలో ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం జరిగింది. ఈ సమావేశంలో కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు ప్రత్యేకంగా పాల్గొన్నారు. ఢిల్లీ నుండి నేరుగా భోగాపురం విచ్చేసిన కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు, మొదటగా ఎయిర్‌పోర్ట్ రన్‌వే, ప్రయాణికుల టెర్మినల్ భవనాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం రాష్ట్ర విద్యా, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్, ఇతర రాష్ట్ర మంత్రులు, సీనియర్ అధికారులు, జీఎంఆర్ సంస్థ ప్రతినిధులతో కలిసి ఎయిర్‌పోర్ట్ బ్లాక్‌లో మీక్ష నిర్వహించారు. సమీక్ష సందర్భంగా వివిధ అంశాల వారీగా జరుగుతున్న పనుల పురోగతిని అధికారులు కేంద్ర, రాష్ట్ర మంత్రులకు సమగ్రంగా వివరించారు. ప్రధాన రహదారుల నిర్మాణాలు, భారీ వాహనాల పార్కింగ్ స్థలాలు, బస్సు రూట్లు, ప్రధాన సభా వేదిక కార్యక్రమాలు, ప్రజల కోసం ఏర్పాటు చేస్తున్న పబ్లిక్ గ్యాలరీ, అత్యవసర వైద్య సదుపాయాలు, ఆహుతులకు టిఫిన్ మరియు భోజన ఏర్పాట్లు, అలాగే గిరిజన సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణపై బాధ్యత కలిగిన అధికారులు వివరణ ఇచ్చారు. అన్ని అంశాలను కూలంకషంగా పరిశీలించిన కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు, మంత్రి నారా లోకేష్ పలు కీలక సూచనలు చేశారు. సభకు వచ్చే ప్రజలను తీసుకువచ్చే బస్సులన్నీ ఉదయం 9:00 గంటలకల్లా కేటాయించిన పార్కింగ్ స్థలాలకు చేరుకోవాలని స్పష్టం చేశారు. అలాగే భోజన పంపిణీ విషయంలో ఎలాంటి తోపులాటలు, ఇబ్బందులు కలగకుండా సులభమైన ప్రణాళికపై అధికారులు ఏకాభిప్రాయానికి వచ్చారు. అన్ని శాఖల అధికారులు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు సమిష్టిగా పనిచేసి ప్రధాని పర్యటనను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమీక్షా సమావేశంలో రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత, మంత్రులు కింజరాపు అచ్చెన్నాయుడు, అనగాని సత్యప్రసాద్, బీసీ జనార్ధన్ రెడ్డి, గుమ్మడి సంధ్యారాణి, కొలుసు పార్థసారథి, గొట్టిపాటి రవికుమార్, కొండపల్లి శ్రీనివాస్, డోలా బాలవీరాంజనేయస్వామిలతో పాటు ఉత్తరాంధ్ర ప్రజాప్రతినిధులు, జీఎంఆర్ ప్రతినిధులు మరియు జిల్లా ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

### హల్దియాకు సమీపంలో తీరం దాటిన

# తీవ్ర వాయుగుండం

**విశాఖపట్నం, జులై 28 తెలుగురాష్ట్రం ప్రతినిధి**
వాయవ్య బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర వాయుగుండం మంగళవారం ఉదయం బెంగాల్‌లోని హల్దియాకు సమీపంలో తీరం దాటింది. ప్రస్తుతం పశ్చిమ బెంగాల్ భూభాగంపై వాయుగుండంగా కొనసాగుతోంది. దీని ప్రభావంతో పశ్చిమ బెంగాల్, ఒడిశాలో భారీ వర్షాలతో పాటు ఏపీలోని పార్వతీపురం, అల్లూరి, శ్రీకాకుళం, విజయనగరం, విశాఖ జిల్లాల్లో మోస్తరు వర్షాలు కురుస్తాయని వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు. వాయుగుండం నేపథ్యంలో ఇప్పటికే కళింగపట్నం నుంచి కాకినాడ వరకు ఉన్న ఓడరేవుల్లో మూడో నంబరు ప్రమాద హెచ్చరిక జారీ చేయగా కోస్తాలోని ఓడరేవుల్లో ఒకటో నంబరు జారీ చేశారు.



## స్పీడ్, క్వాలిటీ, డెలివరీ లక్ష్యంగా రాజధాని పనులు

### వేగం మరింత పెరగాలి...అనుకున్న సమయానికి పనులు పూర్తి కావాలి

### రాజధాని పనులపై కాంట్రాక్ట్ సంస్థలు, అధికారులతో సమీక్షలో సీఎం చంద్రబాబు

**అమరావతి, జులై 28 తెలుగురాష్ట్రం ప్రతినిధి** రాజధాని అమరావతి నిర్మాణ పనుల్లో వేగం మరింత పెరగాలని....అనుకున్న సమయానికి ప్రతి ప్రాజెక్టు పూర్తి కావాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. స్పీడ్, క్వాలిటీ, డెలివరీ లక్ష్యంగా రాజధాని పనులు జరగాలని సీఎం అన్నారు. గతంతో పోల్చితే పనుల్లో వేగం కొంత మేర పెరిగినా... ఇంకా వేగం పెంచాలన్నారు. ఒక నిర్మాణ సంస్థగా రాజధాని పనులు చేపట్టడం గొప్ప అవకాశమని...ఆ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సీఎం సూచించారు. ఆర్థికంగా ఎటువంటి సమస్యలు లేకుండా ప్రభుత్వం చూస్తున్న నేపథ్యంలో... పనుల్లో ఎక్కడా జాప్యం ఉండకూదని సీఎం స్పష్టం చేశారు. సచివాలయంలో రాజధాని అమరావతి నిర్మాణ సంస్థల

- తరువాయి 2లో..



## లోకేశ్ తక్షణమే రాజీనామా చేయాలంటూ జగన్ డిమాండ్



**అమరావతి, జులై 28 తెలుగురాష్ట్రం ప్రతినిధి**
ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో నిర్వహిస్తున్న డీఎస్సీ (ఇూజ) పరీక్షల్లో తీవ్ర అక్రమాలు, పేపర్ లీకేజీలు మరియు స్పోర్ట్స్ కోటా కేటాయింపుల్లో అన్యాయాలు జరుగుతున్నాయని ఆరోపిస్తూ వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి చంద్రబాబు ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఈ అక్రమాలకు నైతిక బాధ్యత వహిస్తూ రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ వ్యవహారంలో జరిగిన అక్రమాలపై వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో యువత మరియు విద్యార్థులతో (Gen-) చేపట్టిన నిరసన ర్యాలీలు విజయవంతమయ్యాయని

- తరువాయి 2లో..

### డీఎస్సీ అవకతవకలకు

# ఆస్కారమే లేదు..

### అత్యాధునిక భద్రతపై ఏపీ ప్రభుత్వం

- మొత్తం 16,347 ఉపాధ్యాయ పోస్టులకు గాను 15,941 మందికి నియామక పత్రాలు జారీ
- ప్రశ్నపత్రం లీకేజీ ఆరోపణలను ఖండించిన ప్రభుత్వం, పారదర్శకతకు పెద్దపీట
- రాష్ట్ర చరిత్రలోనే అత్యంత వేగవంతమైన, పారదర్శక నియామక ప్రక్రియగా వెల్లడి




**అమరావతి, జులై 28 తెలుగురాష్ట్రం ప్రతినిధి**
మెగా డీఎస్సీ-2025 ఉపాధ్యాయ నియామక పరీక్షల ప్రక్రియపై వస్తున్న ఆరోపణలను ఏపీలోని కూటమి ప్రభుత్వం తీవ్రంగా ఖండించింది. ఈ ఆరోపణలు పూర్తిగా నిరాధారమైనవని, ఎలాంటి అవకతవకలకు ఆస్కారం లేకుండా అత్యంత పకడ్బందీ చర్యలతో పరీక్షలు నిర్వహించామని స్పష్టం చేసింది. 16,347 ఉపాధ్యాయ పోస్టుల భర్తీ కోసం

- తరువాయి 2లో..

## చౌక డిపోల్లో స్టీమ్ రైస్ పంపిణీ

- దేశంలోనే తొలిసారి కాకినాడ జిల్లాలో అమలు
- పైలెట్ ప్రాజెక్టుగా 9 వేల మెట్రిక్ టన్నులు ప్రతి నెలా అందజేత
- ఉమ్మడి కృష్ణా, ఉమ్మడి విశాఖ జిల్లాల్లో డిజిటల్ వాలెట్ కు శ్రీకారం
- త్వరలో చౌక డిపోల ద్వారా కందిపప్పు అందిస్తాం

**తక్కువ ధరకే 70 సరకులతో 1000 మీ మార్టులు**
**ఆగస్టు 1 నుంచి తక్కువ ధరకే బియ్యం అమ్మకాలు**
**బాయిల్డ్ రైస్ ధాన్యం సేకరణ కోటా మరో 20 వేల మెట్రిక్ టన్నుల పెంపు**

- రూ.281 కోట్ల నిధుల విడుదలకు గ్రీన్ సిగ్నల్
- రెండు రోజుల ఢిల్లీ పర్యటన అనంతరం ఢిల్లీలో మీడియాతో మాట్లాడిన రాష్ట్ర ఆహార, పౌర సరఫరాల శాఖామాత్యులు శ్రీ నాదెండ్ల మనోహర్



**అమరావతి, జులై 28 తెలుగురాష్ట్రం ప్రతినిధి**
'చౌకధరల డిపో ద్వారా అందిస్తున్న పీడీఎస్ బియ్యాన్ని ప్రజలు ఎందుకు పూర్తి స్థాయిలో వినియోగించడం లేదు..? ప్రతి కేజీ మీద రూ.56 మేర రాయితీని వెచ్చిస్తుంటే ఆ బియ్యం ప్రజలకు ఎందుకు అక్కరకు రాకుండాపోతున్నాయి..? అనే విషయం మీద రాష్ట్ర పౌర సరఫరాల శాఖ లోతుగా అధ్యయనం చేసింది. నిపుణులు, ఆర్థికవేత్తలు, ప్రజల నుంచి ఫీడ్ బ్యాక్ తీసుకున్న తర్వాత ప్రజా పంపిణీలో ఇప్పుడు అందిస్తున్న బియ్యం స్థానంలో, ప్రజలు ఆసక్తి చూపిస్తున్న స్టీమ్ రైస్ అందిస్తే వినియోగం

- తరువాయి 2లో..

# డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా




తెలుగురాష్ట్రం దినపత్రిక

https://epaper.teluguraastram.com

బుధవారం 29 జులై 2026




## బాధితుడు కొల్లు నానిని పరామర్శించిన ఎమ్మెల్యే ఆనందరావు



అమలాపురం జూలై 28- తెలుగు రాష్ట్రం న్యూస్

మంగళవారం ఉదయం చల్లపల్లి గ్రామంలో దురదృష్టవశాత్తు ఇంటి స్లాబు కూలి తీవ్ర గాయాలపాలైన కొల్లు నాని నిలి స్థానిక కిమ్స్ ఆసుపత్రిలో లి శాసనసభ్యులు అయితాబత్తుల ఆనందరావు లి నేరుగా వెళ్లి పరామర్శించారు.ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న నాని ఆరోగ్యం గురించి వైద్యులను అడిగి తెలుసుకున్న ఎమ్మెల్యే , మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. బాధితుని కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి, ప్రభుత్వం తరఫున మరియు వ్యక్తిగతంగా అన్ని విధాలా అండగా ఉంటామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, కూటమి ముఖ్య నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ హెల్పర్లకు యూనిఫార్మ్స్ పంపిణీ చేసిన ఎమ్మెల్యే



అమలాపురం జూలై 28 తెలుగు రాష్ట్రం న్యూస్

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీ వ్యవస్థను మరింత బలోపేతం చేసేందుకు విశేష కృషి చేస్తోందని, అందులో భాగంగానే ఆయా కార్యకర్తలకు, హెల్పర్లకు నాణ్యమైన యూనిఫార్మ్‌లను సమకూర్చిందని లిఅమలాపురం శాసనసభ్యులు అయితాబత్తుల ఆనందరావు పేర్కొన్నారు.మంగళవారం అమలాపురం పట్టణం, హౌసింగ్ బోర్డు కాలనీలో, ఎమ్మెల్యే ఆనందరావు క్యాంపు కార్యాలయం వద్ద లబ్ధిదారులైన అంగన్‌వాడీ హెల్పర్లకు ప్రభుత్వం అందించిన నూతన యూనిఫార్మ్‌లను ఎమ్మెల్యే పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆనందరావు మాట్లాడుతూ:"గర్భిణులు , బాలింతలు, మరియు చిన్న పిల్లల సంక్షేమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్లు కీలక పాత్ర పోషిస్తున్నారు. సీఎంబబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం అంగన్‌వాడీల సంక్షేమానికి పెద్దపీట వేస్తోంది. ప్రసూతి, బాలల ఆరోగ్య సంరక్షణలో హెల్పర్లు అందిస్తున్న సేవలు ఎంతో విలువైనవి. వారి గౌరవాన్ని, గుర్తింపును పెంపొందించేందుకే ప్రభుత్వం ఈ నూతన యూనిఫార్మ్స్‌ను అందించింది" అని తెలిపారు.ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, ఐసిడిఎస్ అధికారులు, అంగన్‌వాడీ సూపర్వైజర్లు, హెల్పర్లు మరియు నియోజకవర్గ కూటమి నాయకులు పాల్గొన్నారు.

## జీతాలు చెల్లించండి మహాప్రభో

### -రక్షిత మంచినీటి సరఫరా ఒప్పంద ఉద్యోగుల ఆవేదన-బకాయి వేతనాలు చెల్లించకపోతే 32 ఆర్ డబ్ల్యు ఎస్ స్కీమ్‌లు బంద్ చేస్తామని హెచ్చరిక




డా. బి. ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లాముమ్మిడివరం ..జులై 28 (తెలుగు రాష్ట్రం విలేఖరి)

డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లాలో రక్షిత మంచినీటి సరఫరా (ఆర.డబ్లు.ఎస్/సి.పి.డబ్లు.ఎస్) పథకాలలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులు బకాయి వేతనాల కోసం ఆందోళన బాట పట్టారు. గత 6 నుంచి 11 నెలలుగా జీతాలు చెల్లించకపోవడంతో తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, ఆగస్టు 5లోగా బకాయిలు చెల్లించని పక్షంలో జిల్లాలోని 32 రక్షిత మంచినీటి పథకాలను నిలిపివేస్తామని హెచ్చరించారు. ఈ మేరకు మంగళవారం జిల్లా కలెక్టర్‌కు ఏపీ ఆర్.డబ్లు.ఎస్ ఉ ఎస్ (సి.పి.డబ్లు.ఎస్) కాంట్రాక్ట్ వర్కర్స్ ట్రేడ్ యూనియన్ నాయకులు వినతిపత్రం సమర్పించారు. వినతిపత్రంలో పేర్కొన్న వివరాల ప్రకారం జిల్లాలోని 32 రక్షిత మంచినీటి పథకాలలో సుమారు 250 మంది కాంట్రాక్ట్ కార్మికులు పనిచేస్తున్నారు. టెండర్ నిబంధనల ప్రకారం కనీస వేతనం, పీఎఫ్, ఈఎస్ఐ వంటి సదుపాయాలు కల్పించడంతో పాటు ప్రతి నెలా జీతాలు చెల్లించాల్సి ఉన్నప్పటికీ, కాంట్రాక్టర్లు బిల్లులు విడుదల కాలేదనే కారణంతో నెలల తరబడి వేతనాలు నిలిపి వేస్తున్నారని ఆరోపించారు. ప్రస్తుతం సెమీ స్కిల్డ్ కార్మికులకు రూ.15,500, అన్‌స్కిల్డ్ కార్మికులకు రూ.14,500 మాత్రమే చెల్లిస్తున్నారని, అయితే ఎస్ఎస్ఆర్ కేటగిరి-3 ప్రకారం రూ.19 వేల నుంచి రూ.24 వేల వరకు కనీస వేతనం చెల్లించాల్సి ఉందని యూనియన్ పేర్కొంది. పీఎఫ్, ఈఎస్ఐ సదుపాయాలు కూడా అమలు కావడం లేదని ఆవేదన వ్యక్తం చేసింది. జిల్లాలోని పి.గన్నవరం, రామచంద్రపురం, ముమ్మిడివరం, అమలాపురం, రాజోలు సబ్ డివిజన్ల పరిధిలోని పలు స్కీమ్‌లలో 3 నుంచి 11 నెలల వరకు వేతనాలు బకాయిగా ఉన్నాయని వివరించింది. ముఖ్యంగా పి.గన్నవరం సబ్ డివిజన్‌లోని మాచవరం స్కీమ్‌లో 11 నెలలుగా, రామచంద్రపురం సబ్ డివిజన్‌లో దంగేరు స్కీమ్‌లో 7 నెలలుగా జీతాలు చెల్లించలేదని తెలిపింది. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అర్ధరాత్రి వేళల్లోనూ, ఎండలను సైతం లెక్కచేయకుండా పైప్‌లైన్ల మరమ్మతులు చేస్తూ మంచినీటి సరఫరా కొనసాగిస్తున్నామని, తమ కష్టాన్ని ప్రభుత్వం గుర్తించాలని కార్మికులు కోరారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ జోక్యం చేసుకుని పెండింగ్ వేతనాలను వెంటనే విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. ఆగస్టు 5వ తేదీలోగా బకాయి జీతాలు చెల్లించని పక్షంలో జిల్లాలోని 32 రక్షిత మంచినీటి పథకాలను నిలిపివేసి, కలెక్టరేట్ ఎదుట దశలవారీ ఆందోళనలు చేపడతామని యూనియన్ అధ్యక్షుడు నాగిరెడ్డి పోషయ్య, కార్యదర్శి చిట్టూరి శ్రీనివాసరావు, డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డి ప్రకాష్ , జి అశోక్, డివెంకన్న బాబు, డి సూర్య భగవాన్, కే కిషోర్, జి వెంకటేష్, రాష్ట్ర నాయకులు రాయుడు శ్రీనివాస్ తో పాటు అధిక సంఖ్యలో కాంట్రాక్ట్ కార్మికులు పాల్గొన్నారు.

## వైఎస్సార్ సీపీ యువజన,విద్యార్థి విభాగాల ఆధ్వర్యర్యంలో భారీ ర్యాలీ...

### -కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసన తెలిపిన పార్టీ శ్రేణులు






అమలాపురం జులై 28: తెలుగు రాష్ట్రం న్యూస్.

రాష్ట్రంలోని యువత, విద్యార్థులు ఎదుర్కొం టున్న సమస్యలపై వైఎస్సార్ సీపీ యువజన, విద్యార్థి విభాగాల ఆధ్వర్యాన జిల్లా కేంద్రం అమలాపురంలో మంగళవారం భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. అమలాపురం నల్లవంతెన వద్ద వంటెద్దు వెంకన్నాయుడు కాంప్లెక్స్ నుంచి కలెక్టరేట్ వరకూ ఈ ర్యాలీ జరిగింది.వైస్సార్సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్రెడ్డి పిలుపు మేరకు జరుగిన ఈ నిరసన కార్యక్రమంలోజిల్లావ్యా ప్తంగా యువత, విద్యార్థులు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.. ఈసందర్బంగా జిల్లా అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి మాట్లాడుతూనీట్ ప్రశ్న పత్రం లీకేజీని నిరసిస్తూ లక్షలాది మంది విద్యార్థులు ఉద్యమించడంతో కేంద్ర ప్రభుత్వం సీబీఐ విచారణ వేసిందని,ఈ ఘటనకు బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తన వద వికి రాజీనామా చేశారన్నారు.రాష్ట్రంలోనూ డీఎస్సీ పేపర్ లీకైంది. స్పోర్ట్స్ కోటాలో అవకతవకలు జరిగాయి. టావ్ ర్యాంకర్లను చివరిలోపెట్టారు. తద్వారా అర్హులకు అన్యాయం జరిగింది. దీనిపై సీబీఐ విచారణ చేయడంతో పాటు, దీనికి బాధ్యత వహిస్తూ రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ రాజీనామా చేయాలని జగ్గి రెడ్డి డిమాండ్పీ చేసారు. ఫీజు రీయింబర్స్మెంటు, నిరుద్యోగ భృతి, వసతి దీవెన బకాయిలు చెల్లించకుండా యువత, విద్యార్థుల పట్ల చం ద్రబాబు ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరి స్తోందని ఆయన పేర్కొన్నారుఈ నిరసన కార్యక్రమంలో అమలాపురం మాజీ ఎంపి చింతా అనురాధ, జిల్లా పరిషత్ఎ చైర్మన్ను విప్పర్తి వేణుగోపాల్, ఎమ్మెల్సీ లు కుడిపూడి సూర్యనారాయణ రావు,తోట త్రిమూర్తులు,బొమ్మి ఇజ్రాయిల్, కో-ఆర్డినేటర్లు పినిపే శ్రీకాంత్, గన్నవరపు శ్రీనివాస్, జక్కంపూడి రాజా, పిల్లి సూర్య ప్రకాష్, పాముల రాజేశ్వరి దేవి, పొన్నాడ సతీష్, నేతలు కుడుపూడి భరత్ భూషణ్., చెల్లుబోయిన శ్రీనివాసరావు. ఒంటెద్దు వెంకన్న నాయుడు,కటకంశెట్టి ఆదిత్య, కుడుపూడి బాబూ, రెడ్డి సత్య నాగేంద్ర మని,సంసాని బుల్లి నాని,కుంచె రమణారావు. కేతా భాను తేజ, పొగాకు శ్రీను, రాజులపూడి మురళీ, విత్తనాల మూర్తి, వై ఎస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు మరియు యువజన, విద్యార్థి విభాగాల నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.



## కామనగరువులో జోరుగా ఇంటింటికీ ప్రచారంలో ఎమ్మెల్యే ఆనందరావు





అమలాపురం జూలై 23 తెలుగు రాష్ట్రం న్యూస్

కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా అమలాపురం నియోజకవర్గంలో చేపట్టిన 2 ఏళ్ల నమ్మకం -- అభివృద్ధి, సంక్షేమం" ఇంటింటి ప్రచార కార్యక్రమంలి రెండో రోజు కామనగరువు గ్రామంలో అత్యంత ఉత్సాహంగా సాగింది. స్థానిక శాసనసభ్యులు అయితాబత్తుల ఆనందరావు మంగళవారం గ్రామంలో విస్తృతంగా పర్యటించి ప్రతి గడపకూ వెళ్లి ప్రజలతో నేరుగా మాట్లాడారు.పర్యటనలో భాగంగా గ్రామస్తులు తమ వీధికి రోడ్డు సౌకర్యం లేదని ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా, ఆయన తక్షణమే స్పందించారు. అక్కడికక్కడే పంచాయతీ కార్యదర్శి ని పిలిపించి, సమస్య తీవ్రతను క్షేత్రస్థాయిలో చూపించారు. "ప్రజల ఇబ్బందులను వెంటనే తొలగించాలి, తక్షణమే ఈ రోడ్డు నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేసి సత్వరమే మంజూరు అయ్యేలా చర్యలు తీసుకోండి" అని సంబంధిత అధికారిని ఎమ్మెల్యే ఆనందరావు అక్కడికక్కడే ఆదేశించారు. ప్రజా సమస్యల పట్ల ఆయన చూపిన చొరవకు గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా ప్రతి ఇంటికీ వెళ్లి గడిచిన రెండేళ్లలో కూటమి సర్కార్ అందించిన ప్రగతి కరపత్రాలను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న సూపర్ సిక్స్ పథకాలైన తల్లికి వందనం, స్త్రీ శక్తి ఉచిత బస్సు ప్రయాణం, దీపం-2 ఉచిత గ్యాస్, అన్నదాత సుఖీభవ, ఎన్టీఆర్ భరోసా పింఛన్లు మరియు మత్స్యకార వికాసం ద్వారా చేకూరిన ప్రయోజనాలను ప్రజలకు వివరంగా వెల్లడించారు. స్థానిక ప్రజల సమస్యలను, వారి సూచనలను నేరుగా అడిగి తెలుసుకున్నారు.అలాగే బాధితులు తెలిపిన సమస్యల వివరాలను అడిగి తెలుసుకున్నారు, అక్కడికక్కడే మై టిడిపి యాప్ లో నమోదు చేయించి, వాటి పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకులు వనమాడి సునీత స్థానిక కూటమి పార్టీల ముఖ్య నాయకులు, క్లస్టర్-యూనిట్-బూత్ కబ్ ఇన్చార్జ్‌లు, కార్యకర్తలు మరియు కామనగరువు గ్రామ ప్రజలు విశేష సంఖ్యలో పాల్గొన్నారు







## నీటి ఎద్దడి దృష్టిలో ఉంచుకొని రైతులు సాగునీటి సంఘాలు సమన్వయం పాటించాలి.

### -జిల్లా కలెక్టర్ డాక్టర్ మహేష్ కుమార్



అమలాపురం జులై 28, తెలుగు రాష్ట్రం న్యూస్

నీటి ఎద్దడి చర్యలను దృష్టిలో ఉంచుకొని రైతులు సాగునీటి సంఘాలు సమన్వయం పాటించాలని జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ తెలిపారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్లో వివేకానంద సమావేశ మందిరంలో ఇరిగేషన్ అధికారులు రైతు నీటి సంఘ నాయకులు ప్రజా ప్రతినిధులతో ఖరీఫ్ పంటకు సంబంధించి సాగు నీటి యాజమాన్యం, పంట కాలువల నిర్వహణ మరియు నీటి విడుదల ప్రణాళికలపై సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఎల్-నినో ప్రభావం, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలోని ఖరీఫ్ పంటకు సాగునీరు పంపిణీ చివరి ఆయికట్టవరకు అందేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని జిల్లా కలెక్టర్ తెలియజేశారు. అదేవిధంగా ఇరిగేషన్ అధికారులు నీటి సంఘం నాయకులు ప్రజాపతినిధులు లోటు వర్షపాతం దృష్టిలో ఉంచుకుని రాబోవు రోజుల్లో సాగునీరు లోతట్టు ప్రాంతాలకు అందేలా సత్వరమైన చర్యలు తీసుకోవాలని, నీటి ప్రవాహం అధికంగా ఉన్నచోట సాగునీరు మళ్లించి దిగువ ప్రాంతాలకు చేరే విధంగా ఇరిగేషన్ అధికారులు నీటి సంఘ నాయకులు సమన్వయం చేసుకుని ప్రత్యేక చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారువాతావరణంలో ఉత్పన్నమయ్యే ఎల్-నినో ప్రభావం మరియు ఇతర సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు వీలుగా ప్రణాళికలు సిద్ధం చేసినట్లు అధికారులు తెలిపారు. జిల్లాలోని ఏ ఒక్క ప్రాంతంలోనూ సాగునీటి కొరత గానీ, పల్లెలు-పట్టణాల్లో తాగునీటి ఎద్దడి గానీ తలెత్తకుండా సెంట్రల్ డెల్టా కాలువల ద్వారా సమర్థవంతంగా నీటిని ప్రవహింపజేస్తున్నట్లు అధికారులు వెల్లడించారు.నీటి నిల్వలు మరియు వినియోగ గణాంకాలు:మే 31 నాటి నుండి ఇప్పటివరకు డెల్టా పరిధిలో సుమారు లిలి9.7 టి.ఎమ్.సి ల నీటిని వినియోగించడం జరిగిందని ఇరిగేషన్ ఇంజనీర్లు తెలిపారు.కాలువల నిర్వహణలో పారదర్శకత కోసం అక్రమ తవ్వకాలు, కాలువల ఆక్రమణలను ప్రత్యేక రిజిస్టర్లలో నమోదు చేస్తూ, చైన్-వైజ్ మార్కింగ్‌లతో నిరంతరం పర్యవేక్షిస్తున్నట్లు ధవళేశ్వరం ఇరిగేషన్ సర్కిల్ అధికారులు వివరించారుప్రస్తుతం జిల్లాలో వరి నారుమళ్లు, నాట్లు వేసే ప్రక్రియ వేగంగా జరుగుతోందని, వేసవి వర్షాలు మరియు కాలువల నీటి లభ్యత వల్ల సాగు పనులు ఆశాజనకంగా ఉన్నాయని తెలిపారు.ఎత్తైన/చివరి ఆయకట్టు ప్రాంతాలకు నీరు చేరడంలో ఇబ్బందులు లేకుండా వంతుల వారీ పద్ధతి అమలు చేయాలని మరియు అవసరమైన చోట అదనపు గంటల పాటు నీటిని విడుదల చేయాలని ప్రాథమికంగా నిర్ణయించారు.ప్రజాప్రతినిధులు - అధికారుల మధ్య విస్తృత చర్చ:సమావేశంలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు, రైతు సంఘాల ప్రతినిధులు కాలువల పూడికతీత, గుర్రపుడెక్క తొలగింపు, కట్టల బలహీనత వంటి స్థానిక సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు.ప్రజాప్రతినిధుల సూచనలపై సానుకూలంగా స్పందించిన అధికారులు, డెల్టా కాలువల చివరి భూములకు సైతం నీరు సక్రమంగా అందేలా చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు.ఖరీఫ్ పంట కాలం అత్యంత కీలకమైనది కాబట్టి ఇరిగేషన్, వ్యవసాయ, రెవెన్యూ మరియు పంచాయతీరాజ్ శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని జిల్లా కలెక్టర్ సూచించారు. రైతులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా కాలువల ద్వారా నీటి విడుదల సమాచారాన్ని ఎప్పటికప్పుడు రైతులకు తెలియజేయాలని అధికారులను ఆదేశించారు.ఈ సమావేశంలో జలవనరుల ప్రాజెక్ట్ చైర్మన్ బొబ్బల శ్రీనివాస్, శాసనమండలి సభ్యులు కుడుపూడి సూర్యనారాయణ స బొమ్ము ఇజ్రాయిల్, పి. గన్నవరం శాసనసభ్యులు గిడ్డి సత్యనారాయణ, ఇరిగేషన్ ఎస్.ఈ జి. శ్రీనివాసరావు ఇరిగేషన్ అధికారులు నీటి సంఘం నాయకులు రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



తెలుగురాష్ట్రం దినపత్రిక

# మహిళను సురక్షితంగా స్వదేశానికి రప్పించిన జిల్లా యంత్రాంగం



**అమలాపురం జూలై 28 తెలుగు రాష్ట్రం న్యూస్**

అమలాపురం మండలం రంగాపురం సమనస గ్రామానికి చెందిన శ్రీమతి చుట్టుగుల్ల వెంకటలక్ష్మి మస్కట్ దేశంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ మహేష్ కుమార్ రావిరాల ఆదేశాల మేరకు జిల్లా యంత్రాంగం, కోనసీమ సెంటర్ ఫర్ మైగ్రేషన్ సమన్వయంతో ఆమెను సురక్షితంగా భారతదేశానికి తీసుకురావడం జరిగింది.వెంకటలక్ష్మి కుటుంబ ఆర్థిక ఇబ్బందుల కారణంగా 2025 నవంబర్ నెలలో నతానియేలు అనే ఏజెంట్ ద్వారా ఉపాధి కోసం మస్కట్ వెళ్లారు. అయితే అక్కడికి చేరుకున్న తర్వాత సరైన ఉద్యోగం లభించక సుమారు రెండు నెలల పాటు ఏజెంట్ కార్యాలయంలోనే ఉంచారు. అనంతరం ఒక కుటుంబంలో గృహ కార్మికురాలిగా పనికి పంపగా, అక్కడ తొమ్మిది మంది పిల్లల సంరక్షణతో పాటు ఇంటి పనులన్నీ చేయాల్సి వచ్చింది. ఎంత కష్టపడి పనిచేసినా యజమాని భార్య తరచూ శారీరకంగా, మానసికంగా వేధించేదని ఆమె తెలిపింది. ఒక సందర్భంలో తీవ్రంగా కొట్టి తిరిగి ఏజెంట్ కార్యాలయానికి అప్పగించగా, నాలుగు లక్షల రూపాయలు చెల్లిస్తేనే భారతదేశానికి పంపుతామని స్పష్టం చేసినట్లు బాధితురాలు వివరించింది.ఈ నేపథ్యంలో కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జిల్లా జాయింట్ కలెక్టర్‌ను కలిసి వెంకటలక్ష్మి భర్త సూర్యనారాయణ ఫిర్యాదు సమర్పించారు. వెంటనే ఆ ఫిర్యాదును కోనసీమ సెంటర్ ఫర్ మైగ్రేషన్‌కు అప్పగించగా, జిల్లా కలెక్టర్ డాక్టర్ మహేష్ కుమార్ రావిరాల ఆదేశాల మేరకు సంబంధిత ఏజెంట్‌తో నిరంతర సంప్రదింపులు జరిపి, బాధితురాలి పరిస్థితిని వివరించి, కుటుంబ సభ్యులు మరియు సంబంధిత ఏజెంట్ సహకారంతో ఆమెను సురక్షితంగా భారతదేశానికి రప్పించినట్లు కోనసీమ సెంటర్ ఫర్ మైగ్రేషన్ నోడల్ అధికారి వి. సుబ్బారావు, సమన్వయకర్త గోళ్ళ రమేష్ తెలిపారు.భారతదేశానికి చేరుకున్న అనంతరం చుట్టుగుల్ల వెంకటలక్ష్మి తన భర్త సూర్యనారాయణతో కలిసి జిల్లా జాయింట్ కలెక్టర్‌ను కలిసి తమకు అండగా నిలిచిన జిల్లా కలెక్టర్, జిల్లా యంత్రాంగం మరియు కోనసీమ సెంటర్ ఫర్ మైగ్రేషన్ అధికారులకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో కడియాల సత్తిబాబు, షేక్ బీబి సఫియా తదితరులు పాల్గొన్నారు.

# కూటమి ప్రభుత్వంలో ప్రతి కుటుంబానికి సంక్షేమ ఫలాలు-ఎమ్మెల్యే వనమాడి



**కాకినాడ జూలై 28 ( తెలుగు రాష్ట్రం ప్రతినిధి ):**

అర్హులైన ప్రతీ కుటుంబానికి కూటమి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించేందుకు కూటమి ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని సిటీ శాసనసభ్యులు వనమాడి కొండబాబు పేర్కొన్నారు. రెండేళ్ల నమ్మకం అభివృద్ధి, సంక్షేమం కార్యక్రమంలో భాగంగా మంగళవారం స్థానిక 26 వ డివిజన్ నందు పర్యటించి రెండేళ్లలో సాధించిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను స్థానిక ప్రజలకు వివరించి కరపత్రాలు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా కొండబాబు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన గత రెండు సంవత్సరాల్లో ప్రజా సంక్షేమం, అభివృద్ధి, పారదర్శక పాలనకు అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని, ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తూ ప్రతి వర్గానికి మేలు జరిగేలా కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి వర్యులు పవన్ కళ్యాణ్ నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధి పథంలో ముందుకు సాగుతోందని, ఇదే ఉత్సాహంతో ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో నగర అధ్యక్షులు మల్లిపూడి వీరు, పంతాడి రాజు, ఎం.డి ఆన్సర్, సంఘాని నాగూర్,ఎండి ఖాన్, సంఘాని గంగాధర్, కొనాడ ప్రకాష్, పాలెపు రాజు, కొల్లు ప్రకాష్, సంఘాని పెద్ద నూకరాజు, ఓలేటి ఆదినారాయణ, మేడ విజయ, మహమ్మద్ జహూర్, పూజారి రమ్య, సాహుల్ సయ్యద్, ఫైసల్, తదితరులు పాల్గొన్నారు.

# బీజేపీ ఏపీ మైనారిటీ మోర్చా రాష్ట్ర సోషల్ మీడియా కో-కన్వీనర్‌గా నవాబ్ షేక్ సర్ధార్ హుస్సేన్

**కాకినాడ, జూలై 28 ( తెలుగు రాష్ట్రం ప్రతినిధి )**



భారతీయ జనతా పార్టీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కేంద్ర కార్యాలయం, విజయవాడలో జరిగిన కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులు పి.వి.ఎన్. మాధవ్ చేతుల మీదుగా రాష్ట్ర బీజేపీ మైనారిటీ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు సయ్యద్ బాషా ఆధ్వర్యంలో నవాబ్ షేక్ సర్ధార్ హుస్సేన్ మైనారిటీ మోర్చా రాష్ట్ర సోషల్ మీడియా కో-కన్వీనర్ గా బాధ్యతలు స్వీకరించారు.రాష్ట్ర స్థాయి బాధ్యతలు స్వీకరించిన అనంతరం కాకినాడ నుండి వేలాది మంది ప్రజలు, భారతీయ జనతా పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో కలిసి భారీ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ ఆయన స్వగ్రామమైన పెద్దాడ మీదుగా కొనసాగింది. అక్కడ తన తల్లి మరియు అత్తగారి ఆశీర్వాదాలు తీసుకున్నారు.అనంతరం ర్యాలీ ఆయన స్వగ్రామమైన రాజుపాలెం చేరుకోగా, గ్రామ ప్రజలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. వేలాది మంది ప్రజలు పాల్గొన్న ఈ భారీ ర్యాలీ విజయవంతంగా కొనసాగింది.అనంతరం రాజుపాలెంలోని బిజెపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో నవాబ్ షేక్ సర్ధార్ హుస్సేన్ మీడియా ప్రతినిధులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బిజెపి ఆంధ్రప్రదేశ్ మైనారిటీ మోర్చా రాష్ట్ర సోషల్ మీడియా కో-కన్వీనర్‌గా తనకు అప్పగించిన బాధ్యతలను పూర్తి నిబద్ధతతో నిర్వహిస్తానని తెలిపారు. పార్టీ సిద్ధాంతాలు, కేంద్ర ప్రభుత్వ ప్రజా సంక్షేమ కార్యక్రమాలను సోషల్ మీడియా ద్వారా ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లడంతో పాటు, మైనారిటీ వర్గాల్లో పార్టీ బలోపేతానికి అంకితభావంతో పనిచేస్తానని పేర్కొన్నారు. రాష్ట్ర నాయకత్వం తనపై ఉంచిన విశ్వాసాన్ని నిలబెట్టుకునేలా నిరంతరం కృషి చేస్తానని తెలిపారు.ఈసందర్భంగా భారీ విందు కార్యక్రమం ఏర్పాటు చేశారు.

# నేడు చెముడులంక ధనలక్ష్మి అమ్మవారి జాతర

**ఆలమూరు,జూలై 28 (తెలుగు రాష్ట్రం విలేఖరి)**



మండల పరిధిలోని చెముడలంక జాతీయ రహదారి చెంతన వేంచేసి ఉన్న శ్రీ ధనలక్ష్మి అమ్మవారి జాతర మహోత్సవం బుధవారం జరగనుంది. ఉదయం అమ్మవారికి గ్రామోత్సవం నిర్వహించి పెద్ద ఎత్తున ఆషాడ మాసం సారె పెట్టడానికి ఏర్పాటు చేస్తున్నారు.అలాగే జాతరలో గరగ నృత్యాలతో పాటు పలు సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు.అదేవిధంగా గురువారం తీర్థ మహోత్సవం నిర్వహించ నున్నట్లు ఆలయ కమిటీ తెలిపింది.

# ఇంటింటీకి తెలుగుదేశం ప్రచారం





**డా. బి. ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా ..జులై 28 (తెలుగు రాష్ట్రం విలేఖరి)ఐ పోలవరం**

డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ముమ్మడివరం నియోజకవర్గం ఐ పోలవరం మండలం మురమళ్లలో "ఇంటిశీటీకి తెలుగుదేశం " 2ఏళ్ళ అభివృద్ధి, నమ్మకం, సంక్షేమం కార్యక్రమంలో ప్రభుత్వ విప్ మరియు ముమ్మిడివరం నియోజకవర్గ శాసనసభ్యులు శ్రీ దాట్ల బుచ్చిబాబు గారితో కలిసి పాల్గొని ఈ రెండేళ్ల కాలంలో చీణూ కూటమి ప్రభుత్వం అమలుచేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు గూర్చి ప్రజలకు కరపత్రాలు పంచి వివరించిన డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు గుత్తుల సాయి గారు. ఈ కార్యక్రమంలో ఐ పోలవరం టిడిపి మండలపార్టీ అధ్యక్షులు



సాగిరాజు సూరిబాబు రాజు గారు, జంపన భీమరాజు గారు, గంజా సుధాకర్ గారు, ఆకాశం శ్రీనివాస్ గారు,త్సవటపల్లి నాగు గారు



మరియు చీణూ కూటమి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# బొమ్మూరు పంచాయతీ మురుగు కూపం...దుర్గంధ భరితం

## - చెరువును తలపిస్తున్న కొత్తపేట రోడ్లు - విష జ్వరాలతో బెంబేలెత్తుతున్న స్థానికులు




**రాజమహేంద్రవరం రూరల్, జులై 28: (తెలుగు రాష్ట్రం ప్రతినిధి)**

బొమ్మూరు పంచాయతీ పరిధిలోని కొత్తపేట ప్రాంతం రోజురోజుకూ మురుగుకూపంగా మారుతోంది. కాలువల్లో మురుగునీరు సక్రమంగా పారకపోవడంతో రోడ్లపై నిలిచిపోయి చెరువులను తలపించే పరిస్థితి నెలకొంది. దుర్గంధం వెదజల్లుతున్న ఈ మురుగునీటి కారణంగా స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.కొత్తపేట ప్రాంతంలోని విద్యార్థులు, ఉద్యోగులు, మహిళలు, వృద్ధులు ప్రతిరోజూ ఈ రహదారి గుండా వెళ్లాల్సి వస్తుండటంతో తీవ్ర అవస్థలు పడుతున్నారు. కాలువల్లో ప్లాస్టిక్ వ్యర్థాలు పేరుకుపోవడం ఒక కారణమైతే, కాలువలను ఆక్రమించి సొంత ఇంటి స్థలం దాటి అక్రమంగా కట్టడాలు నిర్మించడంతో కాలువల వెడల్పు కుదించి, మురుగునీటి ప్రవాహానికి తీవ్ర అంతరాయం కలుగుతోంది. ఈ ఆక్రమణలే ప్రస్తుతం డ్రైనేజీ సమస్య మరింత తీవ్రరూపం దాల్చడానికి ప్రధాన కారణంగా స్థానికులు ఆరోపిస్తున్నారు.ఈ సమస్యపై పలుమార్లు పంచాయతీ అధికారులకు ఫిర్యాదు చేసినా శాశ్వత పరిష్కారం చూపలేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (గ్రా+=గా)లో కూడా ఫిర్యాదు చేసినప్పటికీ పైపైన పనులు చేసి వదిలేశారని ఆరోపిస్తున్నారు.ప్రస్తుతం వర్షాలు పూర్తిస్థాయిలో ప్రారంభం కాకముందే పరిస్థితి ఇంత దారుణంగా ఉంటే, భారీ వర్షాలు కురిసిన తర్వాత ఈ ప్రాంతం పూర్తిగా జలమయం అయ్యే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాలువకు ఆనుకుని ఉన్న మంచినీటి కొళాయిలు కూడా మురుగునీటి మధ్యనే ఉండటంతో ప్రజారోగ్యానికి ముప్పు వాటిల్లే అవకాశముందని చెబుతున్నారు. ఇప్పటికే పలువురు జ్వరాలు, ఇతర సీజనల్ వ్యాధులతో బాధపడుతున్నారని పేర్కొన్నారు.ఈ సమస్యపై పంచాయతీ కార్యదర్శి కాశి విశ్వనాథ్ కు వినతిపత్రం సమర్పించినట్లు స్థానికులు తెలిపారు. వర్షాకాలం మరింత ఉధృతం కాకముందే కాలువలపై ఉన్న ఆక్రమణలను తొలగించి, డ్రైనేజీ వ్యవస్థను



పునరుద్ధరించి, మురుగునీరు సాఫీగా పారేలా చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేస్తున్నారు.ప్రతిరోజూ పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని ప్రచారం చేసుకోవడం కంటే, ఇలాంటి ప్రజా సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపడంపైనే పంచాయతీ, శానిటేషన్ అధికారులు దృష్టి సారించాలని స్థానికులు సూచించారు. ప్రజల ఆరోగ్యం, భద్రతను కాపాడే విధంగా తక్షణ చర్యలు తీసుకుంటేనే అధికారులపై ప్రజలకు విశ్వాసం పెరుగుతుందని వారు అభిప్రాయపడ్డారు.

# ఆంధ్రా షిర్డీ సాయి మందిరంలో గురు పూర్ణిమ మహోత్సవాలకు ఘన ఏర్పాట్లు



**బలభద్రపురం జులై 28(తెలుగు రాష్ట్రం విలేఖరి):**

తూర్పుగోదావరి జిల్లా బిక్కవోలు మండలం బలభద్రపురంలోని ఆంధ్రా షిర్డీ సాయి మందిరంలో గురు పూర్ణిమ మహోత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు సర్వం సిద్ధమైంది. ప్రతి ఏడాది భక్తిశ్రద్ధలతో నిర్వహించే ఈ మహోత్సవాలకు ఈసారి కూడా తూర్పుగోదావరి జిల్లాతో పాటు కోనసీమ, కాకినాడ, రాజమహేంద్రవరం, అల్లూరి సీతారామరాజు జిల్లాల నుంచి వేలాది మంది భక్తులు హాజరుకానుండటంతో ఆలయ పరిసరాల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టారు. గురువు స్థానం దైవం కంటే గొప్పదిగా భావించే భారతీయ సంస్కృతిలో గురు పూర్ణిమకు ప్రత్యేక ప్రాధాన్యత ఉంది. ఈ పవిత్ర దినాన్ని పురస్కరించుకుని ఆంధ్రా షిర్డీ సాయి మందిరంలో ఉదయం నుంచే సాయి నామస్మరణతో కార్యక్రమాలు ప్రారంభమై, అనంతరం గురు పూజ, వ్యాస పూజ, ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు, హారతులు నిర్వహించనున్నారు. ప్రధాన కార్యక్రమాలుగా లోక కళ్యాణార్థం మహా సంకల్ప యజ్ఞం, శ్రీ లక్ష్మీ గణపతి హోమం, దత్తాత్రేయ హోమం, నవగ్రహ హోమం, సుందరకాండ పారాయణం, సామూహిక భజనలు, దీపారాధన, సాయి భక్తి గీతాల కార్యక్రమాలు జరగనున్నాయి. దేశంలో శాంతి, ప్రజల సుఖసంతోషాలు, మంచి వర్షాలు, రైతుల సంక్షేమం కోసం ప్రత్యేక ప్రార్థనలు జరపనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ సబ్బేళ్ల పురుషోత్తం రెడ్డి తెలిపారు. మధ్యాహ్నం 11 గంటల నుంచి ఆలయ ప్రాంగణంలో అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. సాయి సేవలో భాగంగా కుల, మత భేదాలు లేకుండా ప్రతి భక్తుడికి మహాప్రసాదాన్ని అందించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. భక్తులకు తాగునీరు, విశ్రాంతి సౌకర్యాలు, వాహనాల పార్కింగ్ ఏర్పాట్లు కూడా పూర్తి చేశారు. ఆంధ్రా షిర్డీ సాయి మందిరం ఆధ్యాత్మిక కేంద్రంగా మాత్రమే కాకుండా సేవా కార్యక్రమాలకు కూడా నిలయంగా పేరుగాంచింది. ఈ సందర్భంగా చైర్మన్ సబ్బేళ్ల పురుషోత్తం రెడ్డి మాట్లాడుతూ, గురువును స్మరించడం అంటే జ్ఞానాన్ని స్మరించినట్టేనని, సాయిబాబా చూపిన సేవా మార్గంలో ప్రతి ఒక్కరూ నడవాలని సూచించారు. భక్తులందరూ కుటుంబ సమేతంగా గురు పూర్ణిమ మహోత్సవాలకు హాజరై సాయినాథుని ఆశీస్సులు పొందాలని విజ్ఞప్తి చేశారు.



# ఉజ్వల భవిష్యత్తుకు స్పష్టమైన లక్ష్యం ప్రణాళిక అవసరం:

## -ఉపాధి అధికారి సురేష్ కుమార్

**కడప అర్బన్ జూలై 28: (తె లుగు రాష్ట్రం)**

ఉజ్వల భవి ష్యత్తుకు స్పష్టమైన లక్ష్యం ప్ర ణాళిక అవసరమని జిల్లా ఉపా ధి అధికారి ఎ. సురేష్ కుమార్ అన్నారు.ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపు ణ్యాభివృద్ధి సంస్థ, యోగి వేమన విశ్వవిద్యాలయ జాతీయ సేవా పథకం యూనిట్--9 సంయుక్త ఆధ్వర్యంలో "కేంద్ర, రాష్ట్ర ప్రభు త్వ ఉద్యోగాలు, స్వయం ఉపా ధి, స్టార్టప్‌లపై కెరీర్ అవగాహన సదస్సు" మంగళవారంనిర్వహిం చారు. ఈ కార్యక్రమానికి ముఖ్య వక్తగా హాజరైన జిల్లా ఉపాధి అధికారి ఎ. సురేష్ కుమార్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి




తమ భవిష్యత్తుకు స్పష్టమైన లక్ష్యాన్ని నిర్దేశించుకుని, దానిని సాధించే దిశగా ప్రణాళికాబ. ద్ధంగా ముందుకు సాగాల న్నారు .విద్యా ర్థుల్లో ప్రతిభ ఉన్నప్పటికీ, సరైన సమాచారం, అవగాహన లేకపో వడం వల్ల అనేక అవకాశాలను కోల్పోతు న్నారని ఎన్.ఎస్.ఎస్ యూనిట్ -9పీవో శ్రీనివాసరావు అన్నా రు.పేర్కొన్నారు. ఇటు వంటి కెరీర్ అవగాహన సదస్సు లను సద్వి నియోగం చేసుకుని, తమ నైపు ణ్యాలను పెంపొం దించు కుంటూ ఉజ్వల భవిష్య త్తును నిర్మించు కోవాలని విద్యా ర్థులకు పిలుపుని చ్చారు.

## వసతి గృహాలలో విద్యార్థి సంఘాల ప్రవేశాన్ని నిషేధిస్తూ జారీచేసిన ఉత్తర్వులను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే వెనక్కి తీసుకోవాలి.

జూలై 28 తెలుగు రాష్ట్రం ప్రతినిధి.



ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు జాల సుమంత్, వీరపోగు రవి.రాష్ట్రంలోని ప్రభుత్వ వసతి గృహాలలో విద్యార్థి సంఘాలు, ప్రజా సంఘాల ప్రతినిధుల ప్రవేశాన్ని నిషేధిస్తూ ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులను వెంటనే వెనక్కి తీసుకోవాలని మంగళవారం కడప నగరంలోని ఎస్ఎఫ్ఐ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష,కార్యదర్శులు జాల సుమంత్, వీరపోగు రవి అన్నారు. అనంతరం వారు మాట్లాడుతూ...విద్యార్థుల సంక్షేమాన్ని పరిరక్షించాల్సిన ప్రభుత్వం, వారి సమస్యలను వెలుగులోకి తెచ్చే విద్యార్థి సంఘాలను హాస్టళ్లకు దూరం చేయడం ప్రజాస్వామ్య వ్యతిరేక చర్య అని అన్నారు.. వసతి గృహాల్లో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లడంలో, వాటి పరిష్కారం కోసం పోరాడి విజయాలు సాధించడంలో విద్యార్థి సంఘాలు సంఘాలు చారిత్రక పాత్ర పోషించాయి. ఎక్కడో జరిగిన ఘటనపై విచారించి అవసరమైతే సంబంధిత వ్యక్తులపై చర్యలు తీసుకోవాలి. ఇలా అధికార మదంతో నిర్ణయాలు సరికావని ఇప్పటికీ రాష్ట్రంలోని అనేక వసతి గృహాల్లో నేటికీ నాణ్యమైన ఆహారం లేకపోవడం, తాగునీటి కొరత, పారిశుద్ధ్య సమస్యలు, మరుగుదొడ్లు, సిబ్బంది కొరత వంటి అనేక సమస్యలు కొనసాగుతున్నాయి. ఈ సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని ప్రశ్నించేది, విద్యార్థుల తరఫున ఉద్యమించేది విద్యార్థి సంఘాలే. అలాంటి సంఘాల ప్రవేశాన్ని నిషేధించడం అంటే సమస్యలను పరిష్కరించడం కాకుండా వాటిని బయటకు రాకుండా అడ్డుకోవడమే. భారత రాజ్యాంగం ప్రతి పౌరుడికి భావప్రకటనా స్వేచ్ఛ, సంఘాలు ఏర్పాటు చేసుకునే హక్కు, ప్రజాస్వామ్యబద్ధంగా పోరాడే హక్కును కల్పించింది. విద్యార్థి సంఘాలు రాజ్యాంగబద్ధంగా ఏర్పడిన ప్రజాస్వామ్య సంస్థలు. అలాంటి సంఘాలను హాస్టళ్లలోకి అనుమతించకపోవడం విద్యార్థుల రాజ్యాంగబద్ధ హక్కులను కాలరాయడమే కాకుండా ప్రజాస్వామ్య విలువలను అవమానించడం. ప్రజాస్వామ్యంను కాపాడుకునేందుకు విద్యార్థుల పోరాటాన్ని గుర్తించుకోవాలి. నిర్బంధిస్తే ప్రతిఘటన తీవ్రంగా ఉంటుంది. హాస్టళ్లలో ఉన్న లోపాలను సరిదిద్దడానికి చర్యలు తీసుకోవాల్సింది పోయి, వాటిని ప్రశ్నించే గొంతులను అణచివేయడానికి ఉత్తర్వులు జారీ చేయడం అధికార దుర్వినియోగానికి నిదర్శనం. ప్రజాస్వామ్య హక్కులను కాలరాస్తూ జారీ చేసిన ఈ ఉత్తర్వులను ప్రభుత్వం వెంటనే వెనక్కి తీసుకోకపోతే, జిల్లా మరియు రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థులను సమీకరించి విస్తృత స్థాయిలో ఆందోళనలు చేపడతామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కడప నగర కార్యదర్శి అఖిలేష్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రోటోకాల్ ఉల్లంఘన, ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం

### -జిల్లా కలెక్టర్ కు ఎంపీటీసీ దర్ముల అమ్మాజీ, మాజీ సర్పంచ్ మడకం నాగమణి వినతి పత్రం

కూనవరం జులై 28 ( తెలుగు రాష్ట్రం విలేఖరి )




పోలవరం జిల్లా కూనవరం మండలం పెద్దార్కుర్ గ్రామపంచాయతీలో అభివృద్ధి పనుల అమలులో అక్రమాలు, నిధుల దుర్వినియోగం జరిగాయని ఆరోపిస్తూ సంబంధిత అధికారులపై సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ఎంపీటీసీ దర్ముల అమ్మాజీ, మాజీ సర్పంచ్ మడకం నాగమణి, గ్రామస్థులు జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు.గ్రామపంచాయతీ స్పెషల్ ఆఫీసర్ బాధ్యతలు చేపట్టిన తర్వాత స్థానిక ప్రజాప్రతినిధులకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా, ప్రోటోకాల్‌ను ఉల్లంఘించి మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, డిప్యూటీ ఎంపీడీవో జగన్నాధరావు ఒత్తిడితో పంచాయతీ నిధులు దుర్వినియోగం చేశారని వినతిపత్రంలో ఆరోపించారు.అలాగే కలెక్టర్ ఆదేశాల మేరకు మే నెలలో గండి కొత్తగూడెంలో నాలుగు వారాల పాటు గ్రామసభలు నిర్వహించి ప్రజల నుంచి సమస్యలు స్వీకరించినప్పటికీ, ఇప్పటివరకు వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోలేదని పేర్కొన్నారు. తాగునీటి హ్యాండ్‌బోర్లు ఏర్పాటు, విద్యుత్ స్తంభాల ఏర్పాటు, కొత్త ఎంపీపీఎస్ పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రం మంజూరు వంటి కీలక సమస్యలు ఇప్పటికీ పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు.ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ నిర్వహించి బాధ్యులపై చర్యలు తీసుకోవడంతో పాటు గ్రామ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్‌ను ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు కోరారు.

## మాతృశ్రీమోదకొండమ్మ అమ్మవారి జాతరమహోత్సవంలో పాల్గొన్న కంబాల

### -రూ.13 లక్షలతో నిర్మించిన నూతన ఆలయ షెడ్ ప్రారంభం

కోరుకొండ జూలై 28( తెలుగు రాష్ట్రం ప్రతినిధి)




తూర్పుగోదావరి జిల్లాకోరుకొండ మండలం శ్రీరంగపట్నం గ్రామంలో మంగళవారం ప్రారంభమైన, గ్రామదేవత మాతృశ్రీ మోదకొండమ్మ అమ్మవారి జాతర మహోత్సవం సందర్భంగా నిర్వహించిన బోనాల ఊరేగింపు కార్యక్రమం భక్తిశ్రద్ధల మధ్య వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి విశ్వహిందూ దర్మ పరిరక్షణ రామసేన అధ్యక్షులు, భారతీయ జనతా పార్టీ జగ్గంపేట నియోజకవర్గం బీఎల్ఏ-1 కంబాల శ్రీనివాసరావు ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. తొలిత ఆయనకు ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు, మహిళలు, హారతులతో స్వాగతం పలికి, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. ఆలయంలో శ్రీ మోదకొండమ్మ అమ్మవారిని దర్శించుకుని, పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా కంబాల శ్రీనివాసరావు అందజేసిన రూ.13 లక్షలు విరాళంతో కమిటీసభ్యులునూతనంగా నిర్మించిన ఆలయ షెడ్ ను ఆయన రిబ్బన్ కట్ చేసి ఘనంగా ప్రారంభించారు. అనంతరం జాతర మహోత్సవాలు సందర్భంగా గ్రామ మహిళలు ఎత్తుకున్న బోనాలు ఊరేగింపులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కంబాల శ్రీనివాసరావు మాట్లాడుతూ, రాష్ట్ర ప్రజలందరూసుఖశాంతులు, ఆయురారోగ్యాలతో ఉండాలని కోరారు. జాతర మహోత్సవాలు భారతీయ సంస్కృతి,సంప్రదాయాలకు ప్రతీకలని, గ్రామదేవతల పట్ల ప్రజలకు ఉన్న భక్తి, విశ్వాసానికి ఈ వేడుకలు నిదర్శనమన్నారు. శ్రీరంగపట్నం తన సొంత కుటుంబం లాంటిదని, గ్రామంలో ప్రతి ఆలయానికి కూడా లక్షల్లో విరాళాలు ఇవ్వడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో రామసేన సభ్యులు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, ఆలయ కమిటీ సభ్యులు, మహిళలు, గ్రామ పెద్దలు, యువత తదితరులు పాల్గొన్నారు.

# బస్సు ప్రయాణం నరక యాతనం



కమలాపురం జూలై 28 తెలుగు రాష్ట్రం ప్రతినిధి

కమలాపురం మూడు రోడ్ల కూడలి వద్ద తగిన సంఖ్యలో ఆర్టీసీ బస్సులు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నా ప్రయాణికులు... బస్సు ప్రయాణం దినదిన ఘనంగా మారింది అర్జెంటు పని అయితే అంతే సంగతులు పిల్లలు ముసలి వాళ్లు చంటి బిడ్డల తల్లులు తీవ్ర ఇబ్బందులకు గురి అవుతున్నారు బస్సుల కొరత గురించి అనేకమార్లు ఆర్టీసీ అధికారుల దృష్టికి తీసుకుపోయినప్పటికీ అధికారుల పనితీరు స్పందన ఆచరణలో లేదని ప్రయాణికులు చెప్తున్నారు. ప్రజా ప్రతినిధులు దృష్టికి తీసుకుపోయినప్పటికీ సమస్య పరిష్కారం కావడంలేదని వాపోతున్నారు నిత్యం కడప పట్టణానికి విద్య ఉపాధి కోసం వ్యాపారాల కోసం వెళ్లాల్సి ఉంటుందికమలాపురం నుంచి కడపకు విద్య, ఉపాధి, ఉద్యోగాలు, వ్యాపారాలు, ఇతర అవసరాల కోసం ప్రతిరోజూ ప్రయాణిస్తున్న వందలాది మంది ప్రయాణికులు... ప్రయాణిస్తున్న కొత్త బస్సుల రాకతోనే సమస్యకు పరిష్కారం అవుతుందని ప్రయాణికులు తెలుపుతున్నారుబస్సుల కొరత కారణంగా విద్యార్థులు, ఉద్యోగులు, చిరు వ్యాపారులు, కూలీలు గంటల తరబడి బస్సుల కోసం వేచి ఉండాల్సి వస్తోంది...కొంతమంది ఫుట్‌బోర్డులపై నిలబడి ప్రమాదకరంగా ప్రయాణిస్తున్నారు ప్రయాణికులు...ప్రయాణికులు బస్సు ఎక్కుతుండగా బస్సులు కదిలిస్తున్నారు బస్సు డ్రైవర్లు చాలాసార్లు ప్రమాదాలు జరిగాయి కూడా ఇలాంటి పరిస్థితుల్లో ఏదైనా ప్రమాదం జరిగితే బాధ్యత ఎవరు వహిస్తారని ప్రశ్నిస్తున్న ప్రయాణికులు...కమలాపురం కడప మార్గంలో అదనపు బస్సులను ఏర్పాటు చేసి ఇబ్బందులను తొలగించాలని ఆర్టీసీ అధికారులను కోరుతున్న ప్రయాణికులు...ఇదంతా ఒక ఎత్తైతే బస్సులు రాగానే ఆటోవాలా ఈగలు చుట్టుకున్నట్లు బస్సులను చుట్టుకోవడం వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రయాణికులు... ఆర్టీసీ అధికారులు తక్షణమే అదనం బస్సులు కేటాయించాలని కోరుతున్నారు



# వైఎస్ఆర్సిపి ఆధ్వర్యంలో కడప నగరంలో భారీ ర్యాలీ!



జూలై 28 తెలుగు రాష్ట్రం ప్రతినిధి

వైఎస్ఆర్సిపి అధినేత, మాజీ ముఖ్యమంత్రి శ్రీ వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు, డీఎస్సీ లో జరిగిన అక్రమాలకు నైతిక బాధ్యత వహిస్తూ మంత్రి నారా లోకేష్ రాజీనామా చేయాలని ఇవాళ వైఎస్ఆర్ జిల్లా కడప నగరంలో జిల్లా యూత్ దేవి రెడ్డి ఆదిత్య, నగర యూత్, జిల్లా విద్యార్థి విభాగం సాయి దత్త మరియు నగర విద్యార్థి విభాగం సంయుక్త ఆధ్వర్యంలో భారీ ర్యాలీ ఘనంగా నిర్వహించడం జరిగింది.ఈ ర్యాలీ కడప నగరంలోని పార్టీ కార్యాలయం నుండి ప్రారంభమై కోటరెడ్డి సర్కిల్, ఎన్టీఆర్ సర్కిల్, సెవెన్ రోడ్స్, పెద్ద పోస్ట్ ఆఫీస్ వద్ద ఉన్న వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాలవేసి వన్ టౌన్ సర్కిల్ వరకు ఉత్సాహభరితంగా సాగింది. వన్ టౌన్ సర్కిల్ వద్ద ఉన్న మహాత్మా గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నాయకులు ఘనంగా నివాళులు అర్పించి వినతిపత్రం అందజేశార ఈ కార్యక్రమంలోశ్రీ పి రవీంద్రనాథ్ రెడ్డి (కడప జిల్లా అధ్యక్షులు)శ్రీ పి. సురేష్ బాబు (వైఎస్ఆర్సిపి రాష్ట్ర జజుజ మెంబర్)శ్రీ ఎస్. బి. అంజాద్ బాషా (మాజీ డిప్యూటీ సీఎం)శ్రీ ఈ నరేన్ రెడ్డి (కమలాపురం ఇంచార్జ్)శ్రీ రఘురామిరెడ్డి (మైదుకూరు మాజీ ఎమ్మెల్యే)శ్రీమతి సుధమ్మ (బద్వేల్ ఎమ్మెల్యే)శ్రీ రామచంద్ర రెడ్డి (ఎమ్మెల్సీ)శ్రీ రామసుబ్బారెడ్డి (జమ్మలమడుగు ఎమ్మెల్సీ)శ్రీమతి వెంకటసుబ్బమ్మ (కడప జిల్లా మహిళా అధ్యక్షురాలు)శ్రీ పులి సునీల్ కుమార్ (రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్)శ్రీ పాకా సురేష్ (మాజీ మేయర్)శ్రీ నిత్యానంద రెడ్డి (మాజీ డిప్యూటీ మేయర్)శ్రీమతి / శ్రీ దీప్తి రెడ్డి (కడప నగర అధ్యక్షులు)ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి నాయకులు, నాయకురాళ్ళు, మాజీ కార్పొరేటర్లు, మాజీ కౌన్సిలర్లు, మాజీ చైర్మన్లు, వివిధ అనుబంధ సంఘాల ప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు, యువత, విద్యార్థులు, విద్యార్థినులు అతిభారీ సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని దిగ్విజయం చేశారు.



# కోట్లు ఖర్చుపెట్టి వదిలేసిన విద్యుత్ దహన వాటికను ప్రారంభించండి.

### -విద్యుత్ దహన వాటిక కాంట్రాక్టర్ల కోసమేనా ?-మూతబడిన విద్యుత్ దహన వాటికను పరిశీలించిన సిపిఎం కడప ప్రతినిధి బృందం.



కడప జూలై 28 తెలుగు రాష్ట్రం ప్రతినిధి.

కడప నగరం మూడవ డివిజన్ సబ్ జైల్ వెనుక కోట్లు ఖర్చుపెట్టి వదిలివేసిన విద్యుత్ దహన వాటికను తక్షణమే పునరుద్ధరించాలని సిపిఎం కడప నగర కార్యదర్శి రామమోహన్ డిమాండ్ చేశారు. మంగళవారం నాడు క్రిమిటోరియం విద్యుత్ దహన వాటికను సిపిఎం నగర ప్రతినిధి బృందం పరిశీలించారు. ఈ సందర్భంగా సిపిఎం కడప నగర కార్యదర్శి ఎ.రామమోహన్ మాట్లాడుతూ కడప నగరంలో ఉన్న ఏకైక విద్యుత్ దహన వాటికను కోటి 20 లక్షల రూపాయలతో గత నాలుగు సంవత్సరాల కిందట పనులు ప్రారంభించి అన్ని వసతులు పూర్తి చేశారన్నారు. ఇప్పుడు కార్పొరేషన్ అధికారులు ఎందుకు మూతవేశారని ఆయన ప్రశ్నించారు. విద్యుత్ దహన వాటికలో ఒక్క శవం కూడా దహనం చేయలేదని కేవలం కాంట్రాక్టర్ల కోసం, కార్పొరేషన్ ఇంజనీరింగ్ అధికారులకు కమిషన్ల కోసమే కట్టినట్టు ఉందని ఆయన తెలిపారు. దహన వాటికల యంత్రాలు తుప్పు పడుతున్నాయని, వాణిజ్య గ్యాస్ సిలిండర్లు మూలన పడేశారని, సరిగా ఫ్లోరింగ్ కూడా లేదని, ముళ్ళ కంపలతో మూలన పడిందని తక్షణమే పునరుద్ధరించాలని ఆయన డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళన పోరాటాలకు శ్రీకారం చెబుతామని ఆయన హెచ్చరించారు. ఈ పర్యటన కార్యక్రమంలో సిపిఎం నాయకులు దస్తగిరి రెడ్డి రామకృష్ణారెడ్డి, సుబ్బన్న, తిమ్మయ్య, కుమారస్వామిరెడ్డి, నరసింహ తదితరులు పాల్గొన్నారు.




# జగ్గయ్యపేట లోని ప్రభుత్వ కార్యాలయాలకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చిత్రపటాల పంపిణీ




జగ్గయ్యపేట, జూలై 28 (తెలుగురాష్ట్రం విలేకరి):

జగ్గయ్యపేట నియోజకవర్గంలోని ప్రభుత్వ కార్యాలయాల్లో భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చిత్రపటాలు ఏర్పాటు చేయాలనే సదుద్దేశంతో అమర్ సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో చిత్రపటాల పంపిణీ కార్యక్రమం సోమవారం నిర్వహించబడింది. ఈ సందర్భంగా అమర్ సేవా ఫౌండేషన్ వ్యవస్థాపకుడు శ్రీరామ్ సింగ్ మరియు బిజెపి నాయకులు జగ్గయ్యపేట ఎమ్మార్వో కార్యాలయం, సీఐ కార్యాలయం, పోలీస్ స్టేషన్, ప్రభుత్వ ఆసుపత్రి, మున్సిపల్ కార్యాలయం తదితర ప్రభుత్వ కార్యాలయాలకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చిత్రపటాలను అందజేశారు. ఈ సందర్భంగా శ్రీరామ్ సింగ్ మాట్లాడుతూ, భారతదేశ అభివృద్ధి, సుపరిపాలన, ప్రజా సంక్షేమం, జాతీయ సమైక్యత కోసం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అందిస్తున్న నాయకత్వం దేశానికి స్ఫూర్తిదాయకమని అన్నారు. ప్రభుత్వ కార్యాలయాలకు విచ్చేసే ప్రజలకు దేశ నాయకత్వం, జాతీయ విలువలు గుర్తుండేలా ఈ చిత్రపటాలను అందజేస్తున్నట్లు తెలిపారు. అమర్ సేవా ఫౌండేషన్ రాజకీయాలకు అతీతంగా సమాజ సేవ, జాతీయ చైతన్యం, పర్యావరణ పరిరక్షణ వంటి రంగాల్లో ప్రజలకు సేవలందించేందుకు కట్టుబడి ఉందని తెలిపారు. భవిష్యత్తులో కూడా ప్రజలకు ఉపయోగపడే సేవా కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి అసెంబ్లీ కన్వీనర్ మన్నె శ్రీనివాసరావు, బిజెపి పట్టణ అధ్యక్షుడు యంపోగు రాజా, యన్ టి ఆర్ జిల్లా మహిళా మోర్చా కార్యదర్శి మన్నె మాధవి, పట్టణ ప్రధాన కార్యదర్శులు వల్లపునేని కంభాల గోపి, పట్టణ యువ మోర్చా అధ్యక్షుడు తోట గోపి, పట్టణ ఆర్.టి.ఐ. సెల్ కన్వీనర్ నాగేంద్ర కుమార్, జె టివి అధినేత కరిసె మధు, సిద్దు ఫోటో స్టూడియో యజమాని సిద్దు, రాందేవ్ బన్సీలాల్, నరేంద్ర, సంబంధిత ప్రభుత్వ శాఖల అధికారులు మరియు పలువురు సామాజిక సేవకులు పాల్గొన్నారు.





## పేద విద్యార్థులకు ఆపద్బాంధవుడిగా ఉచితంగా సైకిళ్ళు పంపిణీ చేసిన ఎమ్మెల్యే అలిమినేని.

**- 5కోట్ల రూపాయలతో 7300 సైకిళ్ళు గ్రామీణ విద్యార్థులకు అందజేస్తున్నాం- సరస్వతి పుత్రులు, వారి తల్లిదండ్రుల మధ్య సైకిళ్లు అందజేయడం నా అదృష్టం-20 ఏళ్లుగా చదువుకున్న విద్యార్థులకు అండగా ఉన్నాం..ఇక మీద కూడా అండగా ఉంటాం -తల్లిదండ్రులు ఇద్దరు లేని సచిన్ అనే విద్యార్థి తన చదువు బాధ్యత నేను తీసుకుంటా**

కళ్యాణదుర్గం జూలై 28 తెలుగు రాష్ట్రం విలేఖరి

శెట్టురు మండలం ములకలేడు గ్రామంలో విద్యార్థుల పడుతున్న ఇబ్బందులను గుర్తించి వారి చదువులకు ఆటంకం కలగకుండా విద్యను కొనసాగించేందుకు వీలుగా ఉంటుందని ప్రేమతో ఎస్సార్సీ ట్రస్ట్ ద్వారా సైకిళ్లు అందిస్తున్నట్లు ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు పేర్కొన్నారు.. శెట్టూరు మండలం ములకలేడు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో గ్రామీణ ప్రాంతాల నుంచి పాఠశాలకు వచ్చే 9, 10 తరగతి, ఇంటర్ చదివే విద్యార్థులకు ఉచితంగా సైకిళ్ల పంపిణీ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు , మాజీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కరణం రామ్మోహన్ చౌదరి, పార్టీ పరిశీలకులు, వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ రామకృష్ణ, వాల్మీకి కార్పొరేషన్ వైపీ రమేష్, మార్కెట్ యార్డు చైర్మన్ గోళ్ళ లక్ష్మీదేవి, మండల పార్టీ అధ్యక్షులు టీఆర్ తిప్పేస్వామి, ఎమ్ ఈ ఓ లు శ్రీధర్, వాణిదేవి తహసీల్దార్ ఈశ్వరమ్మ, స్థానిక నాయకులు పాల్గొని విద్యార్థులకు సైకిళ్లు పంపిణీ చేశారు..ఈ సందర్భంగా ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు మాట్లాడుతూ నియోజకవర్గంలో ప్రభుత్వ పాఠశాలల్లో, ప్రభుత్వ కళాశాలలో విద్యను అభ్యసిస్తున్న 9,10 తరగతి, ఇంటర్ చదివే గ్రామీణ ప్రాంతాల వారికి ఎస్సార్సీ ట్రస్ట్ ద్వారా 5 కోట్ల రూపాయలతో 7300 సైకిళ్లు అందిస్తున్నామన్నారు.మేము చేస్తున్న ప్రతి కార్యక్రమానికి మాకు తోడుగా ఉంటున్న ఎస్సార్సీ సంస్థ చైర్మన్ ముత్తినేని రాజగోపాల్ , సంస్థ సీఎఫ్ ఓ షీమా, సంస్థ ఎమ్ డీ అమిలినేని యశ్వంత్ , డైరెక్టర్లు దేవినేని నవీన్ కుమార్, దేవినేని ధర్మతేజ, దేవినేని అవినాష్ కి ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నా అన్నారు..సంస్థ నేడు బీటీపీకి స్వంత నిధులతో పనులు చేస్తున్నారు అని అది కేవలం తాత్కాలికంగా మాత్రమే తరువాత ప్రభుత్వం బిల్లులు చెల్లిస్తుందని, అలాగే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే డీఎస్సీ ప్రకటించడంతో మన కళ్యాణదుర్గం ప్రాంతంలో ఎక్కువ మంది నిరుద్యోగ యువత ఉన్నారని తెలుసుకుని ఎక్కడో వెళ్లి లక్షలు వెచ్చించి డీఎస్సీ శిక్షణ తీసుకోలేరన్న ఉద్దేశ్యంతో ఉత్తమ శిక్షణ ఇచ్చే అధ్యాపకులను తీసుకువచ్చి ఇక్కడే వారికి ఉచితంగా శిక్షణతో పాటు, భోజన వసతి కల్పించి నాణ్యమైన స్టడీ మెటీరియల్ అందించామని, కూటమి ప్రభుత్వం డీఎస్సీ నిర్వహించి ఏకంగా 16500 ఉపాధ్యాయులను నియమించిందన్నారు..కళ్యాణదుర్గం ప్రాంతంలో తిమ్మసముద్రం వద్ద 4000 ఎకరాలలో ఇండస్ట్రీయల్ కారిడార్ ఏర్పాటు చేసి ఈ ప్రాంత నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తామని, గత 20 ఏళ్లుగా విద్యార్థులకు అండగా ఉన్నామని ఇక ముందు కూడా అది కొనసాగిస్తామని, ఇదే పాఠశాలలో చదివే సచిన్ అనే విద్యార్థికి తల్లిదండ్రులు ఉద్దరు లేరన్న విషయం తెలిసిందని ఆ విద్యార్థి చదువు బాధ్యత పూర్తిగా తాము తీసుకుంటామన్నారు..

## ఉద్యాన పంటల సాగులో మెరుగైన యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన

**-రాష్ట్ర మానవ హక్కుల ప్రధాన కార్యదర్శి డాక్టర్ గోవాడ ప్రశాంతి**

మచిలీపట్నం, జూలై 28(తెలుగు రాష్ట్రం ప్రతినిధి)




బందరు మండలం అన్ని గ్రామాల్లో రైతులతో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రస్తుతం సాగులో ఉన్న ఉద్యాన పంటలైన బీర, బెండ, దోసకాయతో పాటు తీగజాతి కూరగాయలలో తీసుకోవాల్సిన సస్యరక్షణ చర్యలపై రైతులకు వివరించారు. ప్రస్తుతం నెలకొన్న వర్షాభావ పరిస్థితులు, ఎల్-నీనో ప్రభావం నేపథ్యంలో ఉద్యాన పంటలను సంరక్షించేందుకు అనుసరించాల్సిన యాజమాన్య పద్ధతులు, నీటి వినియోగంలో పాటించాల్సిన జాగ్రత్తలు, పురుగులు మరియు వ్యాధుల నివారణకు తీసుకోవాల్సిన చర్యల గురించి రైతులకు అవగాహన కల్పించారు.అనంతరం బీర, బెండ పంటల తోటలను ప్రత్యక్షంగా పరిశీలించిన డా. గోవాడ ప్రశాంతి, పంటల పరిస్థితిని అంచనా వేసి రైతులకు అవసరమైన సాంకేతిక సూచనలు, సలహాలు అందించారు. వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా శాస్త్రీయ పద్ధతులు పాటిస్తే దిగుబడి, నాణ్యత రెండూ మెరుగుపడతాయని రైతులకు సూచించారు.

## "రెండేళ్ల నమ్మకం" ఇంటింటికి తెలుగుదేశం

**-రోజుకు 2 గ్రామాలు పర్యటిస్తా, రచ్చబండతో ప్రజా సమస్యల పరిష్కారం-ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ**

జగ్గంపేట, జూలై 28:( తెలుగు రాష్ట్రం విలేఖరి)



స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో జగ్గంపేట నియోజకవర్గ ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. సమావేశానికి జగ్గంపేట శాసనసభ్యులు, టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు, టీటీడీ బోర్డు సభ్యులు జ్యోతుల నెహ్రూ అధ్యక్షత వహించారు.కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా "రెండేళ్ల నమ్మకం – అభివృద్ధి, సంక్షేమం" కార్యక్రమాన్ని ఇంటింటికి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు."ఇంటింటికి తెలుగుదేశం" కార్యక్రమాన్ని ప్రతి గ్రామంలో ప్రతిష్టాత్మకంగా నిర్వహించాలి. రోజుకు రెండు గ్రామాల చొప్పున పర్యటిస్తాను. ప్రతి గ్రామంలో రచ్చబండ ఏర్పాటు చేసి ప్రభుత్వం చేసిన అభివృద్ధితో పాటు ప్రజల సమస్యలను స్వయంగా తెలుసుకుని పరిష్కారానికి కృషి చేస్తాను అని ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ అన్నారు.గ్రామాల్లో రైతులకు ఉపయోగపడే విధంగా గ్రావెల్ పుంత రోడ్ల నిర్మాణానికి ప్రభుత్వం నిధులు కేటాయించింది. ఏ గ్రామంలో ఎంత మేర గ్రావెల్ రోడ్లు అవసరమో కార్యకర్తలు గుర్తించి జాబితా అందించాలి అని అన్నారు. నియోజకవర్గంలోని ముఖ్య నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## పోలవరం జిల్లా కేంద్రంలో రహదారుల అభివృద్ధికి 26 కోట్ల తో ప్రతిపాదనలు..

**- జిల్లా కలెక్టర్ కే దినేష్ కుమార్**



రంపచోడవరం,జూలై 28( తెలుగు రాష్ట్రం ప్రతినిధి)

పోలవరం జిల్లా ప్రధాన కేంద్రం రంపచోడవరంలో పెరుగుతున్న ట్రాఫిక్,అత్యవసర సేవల రాకపోకలు మరియు ప్రజా అవసరాలను దృష్టిలో ఉంచుకుని రహదారుల విస్తరణ,అభివృద్ధి పనులకు సంబంధించిన ప్రతిపాదనలను సిద్ధం చేసినట్లు జిల్లా కలెక్టర్ కె. దినేష్ కుమార్ మంగళవారం ఒక ప్రకటన లో తెలిపారు.ఆ మేరకు రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించామన్నారు.ప్రభుత్వ డిగ్రీ కళాశాల,ఇంజినీరింగ్ కళాశాల, పలు ఉన్నత పాఠశాలలు,సబ్ కలెక్టర్ కార్యాలయం,ఆర్టీసీ బస్టాండ్ వంటి ముఖ్య ప్రభుత్వ సంస్థలు ఉన్న ఈ ప్రధాన రహదారి మార్గాలలో రహదారి వెడల్పు తక్కువగా ఉండటంతో ప్రజలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నట్లు ప్రతిపాదనలో పేర్కొన్నారు.ప్రత్యేకంగా అంబులెన్సులు, అగ్నిమాపక వాహనాలు మరియు ఇతర అత్యవసర సేవల వాహనాల సంచారం ఇరుకైన రహదారుల కారణంగా ఆలస్యమవుతోందని కలెక్టర్ వివరించారు.ప్రజల రాకపోకలకు ఆటంకం కలిగిస్తున్న ఆక్రమణలను ఇప్పటికే తొలగించినట్లు కూడా నివేదికలో తెలిపారు.భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకుని రహదారులను నాలుగు లేన్లకు అనుగుణంగా అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందని ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లారు.ఈ పనుల కోసం తొలి దశకు రూ"15.00 కోట్లు, మలి దశకు రూ"11.00 కోట్లు అంచనా వ్యయం రెండు దశల్లో మొత్తం రూ"26.00 కోట్ల అంచనాలతో ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు కలెక్టర్ పేర్కొన్నారు. సంబంధిత విభాగాల ద్వారా సవివర అంచనాలు తయారు చేసి ప్రభుత్వానికి సమర్పించినట్లు తెలియజేస్తూ, పరిపాలనా అనుమతులు మంజూరు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరడం జరిగిందన్నారు.

# అమరావతి ఛాంపియన్‌షిప్--2026 క్రీడా పోటీలకు శ్రీకారం

**-ప్రారంభించిన ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్**



గూడూరు, జూలై 28(తెలుగు రాష్ట్రం ప్రతినిధి)

అమరావతి ఛాంపియన్‌షిప్--2026 కార్యక్రమంలో భాగంగా పెడన నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీలను జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్ ఘనంగా ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ క్రీడలు యువతలో క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలు, జట్టు స్ఫూర్తిని పెంపొందించే గొప్ప సాధనమని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతిభావంతులైన క్రీడాకారులకు ఇలాంటి పోటీలు తమ ప్రతిభను చాటుకునే ఉత్తమ వేదికగా నిలుస్తాయని పేర్కొన్నారు.ప్రభుత్వం క్రీడల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని, విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించి రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. నియోజకవర్గంలోని వివిధ గ్రామ పంచాయతీల నుంచి పెద్ద సంఖ్యలో విద్యార్థులు ఈ క్రీడా పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. క్రీడా ప్రాంగణం విద్యార్థుల సందడితో కళకళలాడగా, పోటీల్లో ప్రతిభ కనబర్చిన క్రీడాకారులను ఎమ్మెల్యే అభినందించరు.. ఈ కార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు గోపి నాగబాబు, కార్యదర్శి తోట వేణు, స్కూల్ ఎస్ఎంసి చైర్మన్ పోతన కృష్ణారావు, టీడీపీ జిల్లా పార్టీ ఉపాధ్యక్షులు అన్నం హరి రామకృష్ణ, రాష్ట్ర యువత కార్యదర్శి ఎన్ ఏ బేగ్, పిఎసిఎస్ అధ్యక్షులు తలుపుల కృష్ణ, మాజీ సర్పంచ్ పోతన రామోజీ, డి వై ఈ ఓ శేఖర్ సింగ్ విద్యాశాఖ అధికారి సుబ్రహ్మణ్యం, జిల్లా స్కూల్ గేమ్స్ సెక్రెటరీ మత్తి అరుణ, ప్రధానోపాధ్యాయులు గొరిపర్తి విజయ కుమారి, కూటమి నాయకులు కాట్రగడ్డ రత్నారావు, పుప్పాల సురేష్, కట్రెడ్డి నాగ మురళి, పోతుల రాము, రసం శెట్టి దుర్గారావు, బేతాళ స్వామి, అట్లూరి శ్రీను, తదితరులు పాల్గొన్నారు,



# మరుగున పడుతున్న రోడ్లకు మోక్షం ఎప్పుడూ

**-పట్టించుకొని అధికారులు -గిరిజన ప్రాంతాలాంటే ఇంత నిర్లక్ష్యమా-ఇదిగో.. అదిగో అని కాలయాపన చేస్తున్న - ఇంజనీరింగ్ అధికారుల ఉదాసీనతపై - హ్యూమన్ రైట్స్ డిఫెండర్ సింహాచలం మండిపాటు**



అనంతగిరి: జూలై 28(తెలుగు రాష్ట్రం విలేఖరి)

అల్లూరి జిల్లా అనంతగిరి మండలంలోని మారుమూల గిరిజన ప్రాంతాల ప్రధాన రహదారులు గుంతలమయంగా మారి, ప్రయాణికులకు తీవ్ర నరకాన్ని చూపుతున్నాయి. ప్రభుత్వం ఏటా రోడ్ల నిర్మాణం, మరమ్మత్తుల కోసం కోట్లాది రూపాయల బడ్జెట్ కేటాయిస్తున్నట్లు ప్రకటిస్తున్నా, గిరిజన ప్రాంతాలకు వచ్చేసరికి నిధుల కరువు వేధిస్తోందని హ్యూమన్ రైట్స్ డిఫెండర్ బిడ్డ సింహాచలం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. నిత్యం వందలాది మంది గిరిజనులు, వాహనదారులు ప్రాణాలను గుప్పిట్లో పెట్టుకుని ఈ దారుల్లో ప్రయాణించాల్సి వస్తోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.మండలంలోని డముకు -- పెద్దబిడ్డ ప్రధాన రహదారి తీవ్ర ప్రమాదకరంగా మారింది. ముఖ్యంగా చెరుకుమడత, కంటిపురం గ్రామాల మధ్యలో ఉన్న రహదారి కింది భాగంలో మట్టి పూర్తిగా కొట్టుకుపోయింది. దీనివల్ల రోడ్డు ఒక్కసారిగా కుంగిపోయే స్థితికి చేరుకుంది. అలాగే అదే దారిలో ఉన్న బ్రిడ్జి భారీ వాహనాలతో కూలిపోయే ప్రమాదం ఉంది.ఈ మార్గంలో నిత్యం ప్రయాణించే ఆటోలు సరుకు రవాణా చేసే భారీ వాహనాలు వెళ్లే సమయంలో రోడ్డు పూర్తిగా కూలిపోయే ప్రమాదం పొంచి ఉందని స్థానికులు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. ఏదైనా ప్రమాదం జరిగితే ప్రాణనష్టం సంభవించే అవకాశం ఉందని, తక్షణమే రక్షణ గోడ లేదా శాశ్వత మరమ్మత్తులు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు.మరోవైపు బొడ్డగడ్డ జంక్షన్ నుండి గున్నమామిడి జంక్షన్ వరకు బిటి రోడ్డు పనులను తక్షణమే ప్రారంభించాలని గిరిజనులు, ప్రజా సంఘాల నాయకులు పలుమార్లు ఇంజనీరింగ్ శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. అయితే అధికారులు మాత్రం ఇదిగో చేస్తాం అదిగో చేస్తాం అంటూ కాలయాపన చేయడం తప్ప క్షేత్రస్థాయిలో పనులు ప్రారంభించడం లేదని సింహాచలం మండిపడ్డారు. అధికారుల ఉదాసీనత వల్లే గిరిజన గ్రామాల రవాణా వ్యవస్థ పూర్తిగా పడకేసిందని విమర్శించారు. ఇంజినీరింగ్ శాఖ స్పందించాలి గిరిజన ప్రాంతాల పట్ల వివక్షను వీడి, సంబంధిత ఇంజనీరింగ్ శాఖ అధికారులు తక్షణమే స్పందించాలని హ్యూమన్ రైట్స్ అడ్వైజర్ సింహాచలం కోరారు. చెరుకుమడత -- కంటిపురం మధ్య రహదారికి తక్షణమే మరమ్మత్తులు చేపట్టడంతో పాటు, బొడ్డగడ్డ -- గున్నమామిడి రోడ్డు పనులను యుద్ధప్రాతిపదికన పునఃప్రారంభించి గిరిజనుల రవాణా కష్టాలను తీర్చాలని ఆయన డిమాండ్ చేశారు. లేనిపక్షంలో గిరిజనులను సమీకరించి పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.



# ఇది మెగా డిఎస్సీ కాదు -డీఎస్సీ స్కాంపై సిబిఐ విచారణ చేయాలి



మచిలీపట్నం, జూలై 28(తెలుగు రాష్ట్రం ప్రతినిధి)

కృష్ణాజిల్లా వ్యాప్తంగా వైసిపి విద్యార్థి, యువత ర్యాలీ కార్యక్రమంలో పాల్గొన్న ఉప్పాల రాము కేంద్రంలోని మచిలీపట్నం నందు విద్యార్థి విభాగం, యువజన విభాగం ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు.కార్యక్రమంలో పాల్గొని మెగా డీఎస్సీ--2025 అక్రమాలపై సీబీఐ విచారణ జరిపించి, నైతిక బాధ్యత వహిస్తూ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ వెంటనే రాజీనామా చేయాలి అని పెడన నియోజకవర్గం ఇంచార్జ్ ఉప్పాల రాము డిమాండ్ చేశారు.ప్రభుత్వ విద్యను నిర్వీర్యం చేయడాన్ని ఆపి, విద్యార్థులకు పుస్తకాలు, విద్యాకానుక, పూర్తిస్థాయి ఫీజు రీయింబర్స్మెంట్, వసతి దీవెన వంటి సంక్షేమ పథకాలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా ఉప్పాల రాము మాట్లాడుతూ విద్యార్థులు, నిరుద్యోగ యువతకు ఇచ్చిన ఎన్నికల హామీలన్నింటినీ అమలు చేసి, ప్రభుత్వ విద్యను బలోపేతం చేస్తూ ప్రతి విద్యార్థి భవిష్యత్తుకు భరోసా కల్పించాలని మెగా డీఎస్సీ పేరుతో ఆర్భాటంగా ప్రచారం చేసి చేపట్టిన టీచర్ల నియామకాల్లో అంతులేని అక్రమాలు చోటు చేసుకున్నాయి. వాటికి నైతిక బాధ్యత వహిస్తూ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ రాజీనామా చేయాలి. మెగా డీఎస్సీపై సీబీఐ విచారణ జరిపించాలి. డీఎస్సీ---2025లో మొత్తం 16 వేలకుపైగా టీచర్ పోస్టుల భర్తీ చేపట్టగా, స్పోర్ట్స్ కోటా కింద 421 ఉపాధ్యాయ పోస్టులకు రాత పరీక్ష లేకుండా క్రీడా ప్రతిభ, సర్టిఫికెట్ల ఆధారంగా ఎంపిక చేశారు. అందుకోసం మొత్తం నియమావళి మార్చి ప్రత్యేకంగా జీఓలు జారీ చేశారు. కనీసం డిగ్రీ లేకున్నా, టెట్లో అర్హత సాధించకున్నా కేవలం శాప్ సర్టిఫికెట్లతో ఉద్యోగాలు ఇచ్చేశారు. ఇలా బహుశా, దేశంలోని ఏ రాష్ట్రంలో కూడా జరిగి ఉండదు. తమ పని కానిచ్చాక, ఆ జీఓలు రద్దు చేస్తూ, పాత నియమావళినే పునరుద్ధరిస్తూ, మళ్లీ కొత్తగా జీఓలు జారీ చేశారు. అంతులేని అక్రమాలతో కూడిన ఈ పరీక్షపై మా పార్టీ స్పష్టంగా అనేక ఆధారాలు చూపింది. అయినా ప్రభుత్వం ఎదురుదాడి చేస్తూ, తమకు తామే క్లీన్చిట్ ఇచ్చుకోవడం దారుణం. నిజంగా డీఎస్సీ---2025లో ఎలాంటి అవకతవకలు జరగకపోతే, మా పార్టీ డిమాండ్ చేస్తున్నట్లు సీబీఐ దర్యాప్తుకు ఎందుకు ఒప్పుకోవడం లేదు..? ఆ పని చేయడం లేదంటే, అక్కడ తప్పు జరిగిందనేగా..? అందుకే మళ్లీ డిమాండ్ చేస్తున్నాం. మెగా డీఎస్సీపై సీబీఐ వంటి స్వతంత్ర సంస్థతో విచారణ జరిపించాలి. అంతే కాకుండా విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ తక్షణమే రాజీనామా చేయాలి. దాదాపు 3.5 లక్షల మంది టీచర్ అభ్యర్థుల జీవితాలకు సంబంధించిన ఉపాధ్యాయ నియామకాల్లో ఒక్క అక్రమం జరిగినా అది మొత్తం విద్యా వ్యవస్థపై నమ్మకాన్ని దెబ్బ తీస్తుంది. ఇది అత్యంత హానికరం అని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో కృష్ణాజిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు శ్రీ పేర్ని నాని , కృష్ణా జిల్లా జడ్పీ చైర్ పర్సన్ శ్రీమతి ఉప్పాల హారిక , పెనమలూరు నియోజకవర్గ సమన్వయకర్త శ్రీ దేవాభక్తుని చక్రవర్తి గారు మాజీ శాసనసభ్యులు అవినిగడ్డ నియోజకవర్గం ఇంచార్జ్ శ్రీ సింహాద్రి రమేష్ తనయుడు సింహాద్రి వికాస్ బాబు మచిలీపట్నం నియోజకవర్గ ఇన్చార్జ్ పేర్ని కిట్టు గారు మరియు జిల్లా వ్యాప్తంగా ఉన్న వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు నాయకులు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు...




# బీజేపీ ఏపీ మైనారిటీ మోర్చా రాష్ట్ర సోషల్ మీడియా కో-కన్వీనర్‌గా నవాబ్ షేక్ సర్ధార్ హుస్సేన్

కాకినాడ, జూలై 28( తెలుగు రాష్ట్రం ప్రతినిధి):

భారతీయ జనతా పార్టీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కేంద్ర కార్యాలయం, విజయవాడలో జరిగిన కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులు పి.వి.ఎన్. మాధవ్ చేతుల మీదుగా, ఆంధ్రప్రదేశ్ బీజేపీ మైనారిటీ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు సయ్యద్ బాషా ఆధ్వర్యంలో నవాబ్ షేక్ సర్ధార్ హుస్సేన్ మైనారిటీ మోర్చా రాష్ట్ర సోషల్ మీడియా కో-కన్వీనర్గా బాధ్యతలు స్వీకరించారు.రాష్ట్ర స్థాయి బాధ్యతలు స్వీకరించిన అనంతరం కాకినాడ నుండి వేలాది మంది ప్రజలు, భారతీయ జనతా పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో కలిసి భారీ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ ఆయన స్వగ్రామమైన పెద్దాడ మీదుగా కొనసాగింది. అనంతరం ర్యాలీ ఆయన స్వగ్రామమైన రాజుపాలెం చేరుకోగా, గ్రామ ప్రజలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. వేలాది మంది ప్రజలు పాల్గొన్న ఈ భారీ ర్యాలీ విజయవంతంగా కొనసాగింది.అనంతరం రాజుపాలెంలోని భారతీయ జనతా పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో నవాబ్ షేక్ సర్ధార్ హుస్సేన్ మీడియా ప్రతినిధులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, భారతీయ జనతా పార్టీ ఆంధ్రప్రదేశ్ మైనారిటీ మోర్చా రాష్ట్ర సోషల్ మీడియా కో-కన్వీనర్‌గా తనకు అప్పగించిన బాధ్యతలను పూర్తి నిబద్ధతతో నిర్వహిస్తానని తెలిపారు. పార్టీ సిద్ధాంతాలు, కేంద్ర ప్రభుత్వ ప్రజా సంక్షేమ కార్యక్రమాలను సోషల్ మీడియా ద్వారా ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లడంతో పాటు, మైనారిటీ వర్గాల్లో పార్టీ బలోపేతానికి అంకితభావంతో పనిచేస్తానని పేర్కొన్నారు. రాష్ట్ర నాయకత్వం తనపై ఉంచిన విశ్వాసాన్ని నిలబెట్టుకునేలా నిరంతరం కృషి చేస్తానని తెలిపారు.ఈసందర్భంగా భారీ విందు కార్యక్రమం ఏర్పాటు చేశారు.



# వింబుల్డన్ రాయల్ బాక్స్ వెనుక ఉన్న ఆసక్తికరమైన నిజాలు

**టెన్నిస్ ప్రపంచంలో అత్యంత ప్రతిష్ఠాత్మకమైన వింబుల్డన్ టోర్నమెంట్ అంటే కేవలం ఆడే క్రీడాకారులకు మాత్రమే కాకుండా టీవీల్లో చూసే ప్రేక్షకులకు కూడా ఒక ప్రత్యేకమైన అనుభూతిని ఇస్తుంది. ఇక్కడ జరిగే మ్యాచ్‌లను ప్రత్యక్షంగా కోర్ట్‌లో కూర్చుని చూడటం ఎంతోమంది అభిమానులకు ఒక పెద్ద కల లాంటిది. అయితే ఈ మ్యాచ్‌లు జరుగుతున్నప్పుడు సెంటర్ కోర్ట్‌లో ఆటగాళ్ల ఆటతీరుతో పాటు టీవీ కెమెరాలన్నీ తరచుగా ఒక ప్రత్యేకమైన సీటింగ్ ఏరియా వైపు వెళుతుంటాయి. అక్కడే ఎంతోమంది ప్రపంచ స్థాయి సెలబ్రిటీలు కూర్చుని మ్యాచ్‌లను ఆస్వాదిస్తుంటారు. రీసెంట్ గా జరిగిన 2026 వింబుల్డన్ ఫైనల్ మ్యాచ్‌లో మన భారత క్రికెట్ స్టార్స్ సచిన్ టెండూల్కర్, శుభ్‌మన్ గిల్ అక్కడ కనిపించి వార్తల్లో నిలిచారు. ఇంతకీ ఆ స్పెషల్ సీటింగ్ ఏరియా ఏంటి?, అక్కడికి వెళ్లాలంటే ఎలాంటి రూల్స్ ఫాలో అవ్వాలి?, దాని వెనుక ఉన్న చరిత్ర ఏంటో తెలిస్తే నిజంగా ఆశ్చర్యపోతారు. అసలు వివరాల్లోకి వెళితే**



### రాయల్ బాక్స్ స్పెషాలిటీ ఏంటి?

వింబుల్డన్ సెంటర్ కోర్ట్‌లో సెలబ్రిటీలు కూర్చునే ఆ ప్రత్యేకమైన స్థానాన్ని రాయల్ బాక్స్ అని పిలుస్తారు. ఈ అద్భుతమైన రాయల్ బాక్స్‌ను 1922వ సంవత్సరంలో ఏర్పాటు చేశారు. ఇందులో 74 సీట్లు మాత్రమే ఉంటాయి, అవన్నీ ఆకుపచ్చ రంగులో ఉండే ప్రత్యేకమైన కుర్చీలు. ఈ సీట్లలో కూర్చుంటే సెంటర్ కోర్ట్‌లో జరిగే మ్యాచ్‌లను స్పష్టంగా చూసే అద్భుతమైన అవకాశం దక్కుతుంది. అలాగే రాచరికపు మర్యాదలు అందుతాయి. ఈ బాక్స్‌లోకి అనుమతి పొందిన అతిథులకు క్లబ్ హౌస్‌లో గ్రాండ్ వెల్కమ్ చెబుతారు, ఆ తర్వాత అద్భుతమైన లంచ్ ఏర్పాట్లు ఉంటాయి. మ్యాచ్‌లు ముగిసిన తర్వాత కూడా మధ్యాహ్నం టీ, ఇతర డ్రింక్స్ సర్వ్ చేస్తూ వాళ్లను ఒక రేంజ్‌లో ట్రీట్ చేస్తారు.

### ఆహ్వానాలు ఎవరికి అందుతాయి

సాధారణ ప్రేక్షకులకు ఈ రాయల్ బాక్స్ టికెట్లు కొనుక్కునే అవకాశం ఎట్టి పరిస్థితుల్లోనూ ఉండదు. ఎంత డబ్బు ఉన్నా, ఎంత పెద్ద సెలబ్రిటీ అయినా సరే దీనికోసం ఎలాంటి ఆన్‌లైన్ లేదా ఆఫ్‌లైన్ టికెటింగ్ సిస్టమ్, హాస్పిటాలిటీ ప్యాకేజీలు అందుబాటులో లేవు. ఆల్ ఇంగ్లాండ్ లాన్ టెన్నిస్ క్లబ్ (ఏఈఎల్‌టీసీ) పంపే ప్రత్యేకమైన ఆహ్వానం ఉంటేనే అక్కడికి ఎంట్రీ ఇస్తారు. బ్రిటన్ తో పాటు ఇతర దేశాలకు చెందిన రాజ కుటుంబీకులు, దేశాధినేతలు, కరెంట్ లేదా మాజీ టెన్నిస్ క్రీడాకారులు, టోర్నీ కమర్షియల్ పార్ట్‌నర్స్, బ్రిటిష్ ఆర్మీ అధికారులు, మీడియా ప్రతినిధులకు మాత్రమే ఈ ఆహ్వానాలు వెళుతుంటాయి. ఏ సమయంలో ఎవరు ఏఈఎల్‌టీసీ (ఏఈఎల్‌టీసీ) క్లబ్ చైర్మన్‌గా ఉంటే వారే ఈ గెస్ట్ లిస్ట్‌ను ఫైనల్ చేస్తారని నివేదికలు చెబుతున్నాయి. దీనికోసం బయటకు కనిపించే పబ్లిక్ రూల్స్ ఏవీ లేకపోవడం విశేషం.

### ఎంట్రీకి కఠినమైన డ్రెస్ కోడ్ రూల్స్

ఈ రాయల్ బాక్స్‌లోకి వెళ్లాలంటే డ్రెస్ కోడ్ విషయంలో చాలా కఠినమైన నిబంధనలు పాటించాల్సిందే. పురుషులు కచ్చితంగా లాంజ్ సూట్ లేదా బ్లేజర్ వేసుకోవాలి, దానికి కాలర్ ఉన్న షర్ట్, టైతో పాటు ఫార్మల్ షూస్ ధరించాలి. క్యాజువల్ డ్రెస్సులు, ఓపెన్ కాలర్ షర్ట్స్, క్యాజువల్ షూస్ వేసుకుంటే లోపలికి అస్సలు రానివ్వరు. ఇక మహిళల విషయానికి వస్తే చాలా పద్ధతిగా, చూడటానికి క్లాసీగా ఉండే మోకాళ్ల కింద వరకు ఉండే డ్రెస్‌లు మాత్రమే ధరించాల్సి ఉంటుంది. వెనుక కూర్చున్న వాళ్లకు మ్యాచ్ చూడటానికి ఇబ్బంది లేకుండా టోపీలు పెట్టుకోవడాన్ని సాధారణంగా నిషేధించారు. రూల్స్ ఎవరికైనా ఒకటే అనడానికి 2015లో జరిగిన ఒక సంఘటనే నిదర్శనం. ఆ ఏడాది ఫార్ములా వన్ రేసర్ లూయిస్ హామిల్టన్ సరైన డ్రెస్ కోడ్ పాటించనందున అతడిని రాయల్ బాక్స్‌లోకి రానివ్వలేదు. దీంతో అతను ఫెదరర్, జకోవిచ్ మధ్య జరిగిన మెన్స్ సింగిల్స్ ఫైనల్ మ్యాచ్‌ను మిస్ అయ్యాడు.

# 0,0,0,0,0,0,0.. వరుసగా 7 డకౌట్లతో సంచలనం..

## 8వ ఇన్నింగ్స్‌లో ఊహించని సీన్




క్రికెట్ అభిమానులకు పాత జ్ఞాపకాలను నెమరువేసుకోవడం ఎప్పుడూ ఆనందాన్నే ఇస్తుంది. తాజాగా సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్న ఒక పాత వీడియో చూస్తే ఎవరికైనా నవ్వు రాక మానదు. ఆస్ట్రేలియాతో జరిగిన ఓ టెస్ట్ మ్యాచ్‌లో అజిత్ అగార్కర్ బ్యాటింగ్‌కు దిగాడు. అప్పట్లో ఆసీస్ బౌలింగ్ దళం ఎంత ప్రమాదకరంగా ఉండేదో అందరికీ తెలిసిందే. మెక్‌గ్రాత్, బ్రెట్ లీ లాంటి దిగ్గజాలు బంతితో నిప్పులు చెరిగేవాళ్లు. అలాంటి సమయంలో క్రీజులోకి వచ్చిన అగార్కర్.. బంతిని నెమ్మదిగా ఆడి ఒక్క పరుగు కోసం అవతలి ఎండ్‌కు పరుగెత్తాడు. ఆ పరుగు పూర్తి చేయగానే అగార్కర్ ముఖంలో వెయ్యి వోల్టుల ఆనందం కనిపించింది. పిచ్ మధ్యలోనే రెండు చేతులు గాల్లోకి ఎత్తి, అమాంతం ఎగురుతూ ఒక గొప్ప విజయాన్ని సాధించినట్లుగా సంబరాలు చేసుకున్నాడు. డ్రెస్సింగ్ రూమ్‌లో ఉన్న సహచర ఆటగాళ్లు సైతం అతని ఉత్సాహాన్ని చూసి నవ్వులు చిందించారు. ఈ వీడియోను క్రికెట్ అభిమాని నిబ్రాజ్ రంజాన్ ఎక్స్ వేదికగా పంచుకోగా, అది క్షణాల్లోనే నెట్టింట దావానలంలా వ్యాపించింది.

### పీడకల లాంటి ఆ డకౌట్ల పరంపర..

అసలు ఒక్క పరుగుకే అగార్కర్ అంతలా ఎందుకు సంబరపడ్డాడు అన్న సందేహం ఇప్పటి కుర్రకారుకు రావచ్చు. దానికి అసలు కారణం ఆ పరుగుకు ముందు అతను ఎదుర్కొన్న గడ్డుకాలమే. వరుసగా ఆరు ఇన్నింగ్స్‌లలో అతను సున్నాకే పెవిలియన్ చేరాడు. ఆస్ట్రేలియా గడ్డపై అడిలైడ్, మెల్‌బోర్న్, సిడ్నీ మైదానాలతో పాటు ముంబైలో జరిగిన మ్యాచ్‌లలోనూ ఖాతా తెరవకుండానే అవుట్ అయ్యాడు. ఒక బ్యాటర్‌గా క్రీజులోకి వెళ్లి పరుగులు చేయకుండానే వెనుదిరగడం ఎంతటి అవమానంగా ఉంటుందో ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. ఏడోసారి కూడా అదే పరిస్థితి వస్తుందేమో అన్న భయం అతనిలో స్పష్టంగా కనిపించింది. ఆ తీవ్రమైన ఒత్తిడిని జయించి, ఎట్టకేలకు ఆ డకౌట్ల పరంపరకు తెరదించుతూ ఒక్క పరుగు తీయగానే అతనిలో ఆపుకోలేనంత ఆనందం కట్టలు తెంచుకుంది. లైవ్ ప్రసారంలో టీవీ స్క్రీన్ పై అతను వరుసగా ఆరుసార్లు డకౌట్ అయిన గ్రాఫిక్స్ కూడా ఈ వీడియోలో స్పష్టంగా కనిపిస్తోంది. ఇది అతని కెరీర్ లోనే ఓ మాయని మచ్చగా మిగిలిపోయింది.

### అప్పటి ఆటగాడు.. ఇప్పటి చీఫ్ సెలెక్టర్..

అగార్కర్ ఆ రోజుల్లో అద్భుతమైన ఫాస్ట్ బౌలర్ అనడంలో ఎలాంటి సందేహం లేదు. బ్యాట్ తోనూ అప్పుడప్పుడు అద్భుతాలు చేశాడు. చారిత్రక లార్డ్స్ మైదానంలో టెస్ట్ సెంచరీ సాధించిన ఘనత అతని సొంతం. అయినా సరే, బ్యాటింగ్‌లో ఇలాంటి విచిత్రమైన చెత్త రికార్డులు కూడా మూటగట్టుకున్నాడు. ప్రస్తుతం అతను భారత క్రికెట్ కంట్రోల్ బోర్డు (బీసీసీఐ) చీఫ్ సెలెక్టర్ లాంటి అత్యున్నత పదవిలో ఉన్నాడు. ఏ ఆటగాడిని ఎంపిక చేయాలి, ఎవరిని పక్కన పెట్టాలి అన్నది పూర్తిగా అతని చేతుల్లోనే ఉంది. ఈ నేపథ్యంలో నెటిజన్లు ఈ పాత వీడియో కింద చాలా ఫన్నీగా కామెంట్లు పెడుతున్నారు. ఆ రోజుల్లో ఒక్క పరుగు కోసం నానా తంటాలు పడ్డ అగార్కర్.. ఈరోజు ఏకంగా భారత క్రికెట్ భవితవ్యాన్ని నిర్దేశిస్తున్నాడు అంటూ సరదాగా ఆటపట్టిస్తున్నారు.

సోషల్ మీడియా యుగంలో ఇలాంటి వింటేజ్ వీడియోలు బయటకు వచ్చినప్పుడు అభిమానులు ఎంతో ఉద్వేగానికి లోనవుతారు. అప్పటి క్రికెట్ మ్యాచ్ లు చూస్తూ పెరిగిన తొంభైల దశకం కిడ్స్ ఈ వీడియో కింద తమ చిన్ననాటి జ్ఞాపకాలను పంచుకుంటున్నారు. అగార్కర్ హెల్మెట్ తీసి నవ్వుతూ అభివాదం చేయడం, ఆసీస్ ఆటగాళ్లు సైతం ఆశ్చర్యంగా చూడటం ఈ వీడియోలో హైలైట్ గా నిలిచాయి. ఏది ఏమైనా ఆటలో గెలుపోటములు, పరుగులు, డకౌట్లు సర్వసాధారణం.

ఒకప్పుడు మైదానంలో తన ఆటతో, అల్లరితో అలరించిన అగార్కర్.. ఇప్పుడు చీఫ్ సెలెక్టర్‌గా భారత క్రికెట్‌ను ముందుకు నడిపిస్తున్న తీరు నిజంగా విశేషం. ఇలాంటి పాత వీడియోలు క్రికెట్ ఫ్యాన్స్‌కు అప్పటి మధుర స్మృతులను గుర్తుచేస్తూ ఆనందాన్ని పంచుతూనే ఉంటాయి.

# టీ20 ప్రపంచ కప్ ఆతిథ్యం కోసం 14 నగరాలు రెడీ

**టీ20 ప్రపంచ కప్ 2028 కోసం సన్నాహాలు అధికారికంగా ప్రారంభమయ్యాయి. తొలి అడుగుగా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ క్రికెట్ బోర్డులు సంయుక్తంగా 14 నగరాల జాబితాను సిద్ధం చేసి అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ)కి సమర్పించాయని ప్రముఖ క్రీడా మీడియా సంస్థ 'కోడ్ స్పోర్ట్స్' నివేదించింది. అయితే, ఐసీసీ చివరకు 8 నుంచి 10 స్టేడియాలను మాత్రమే ఎంపిక చేసే అవకాశం ఉంది. దీని అర్థం, బిడ్లు సమర్పించిన నగరాలలో 4 నుంచి 6 నగరాలు ప్రపంచ కప్ మ్యాచ్‌లకు ఆతిథ్యం ఇచ్చే రేసు నుంచి తప్పుకుంటాయన్నమాట.**




క్రికెట్ ఆస్ట్రేలియా (జూూ), న్యూజిలాండ్ క్రికెట్ బోర్డు సంయుక్తంగా 2028 అక్టోబర్, నవంబర్ నెలల్లో ఈ మెగా టోర్నమెంట్‌ను నిర్వహించనున్నాయి. న్యూజిలాండ్ తన చరిత్రలో తొలిసారిగా టీ20 ప్రపంచ కప్‌నకు సహ-ఆతిథ్యం ఇవ్వడం ఒక విశేషం.

ఆస్ట్రేలియా ఆతిథ్యం: ఆస్ట్రేలియా సుమారు 5 నగరాల్లో మ్యాచ్‌లకు ఆతిథ్యం ఇచ్చే అవకాశం ఉంది. ఆస్ట్రేలియా గతంలో 2022 టీ20 ప్రపంచ కప్‌ను విజయవంతంగా నిర్వహించింది.

న్యూజిలాండ్ ఆతిథ్యం: న్యూజిలాండ్ కనీసం 3 ప్రధాన నగరాలైన ఆక్లాండ్, వెల్లింగ్టన్, క్రైస్ట్‌చర్చ్‌లలో మ్యాచ్‌లకు ఆతిథ్యం ఇవ్వడానికి సన్నద్ధమవుతోంది.

### 14 ఆతిథ్య నగరాల జాబితా:

ఆస్ట్రేలియా నగరాలైన మెల్బోర్న్, సిడ్నీ, అడిలైడ్, పెర్త్, బ్రిస్బేన్, హోబార్ట్, గీలాంగ్, కాన్‌బెర్రా మరియు డార్విన్ బిడ్లను సమర్పించాయి. న్యూజిలాండ్ నగరాలైన ఆక్లాండ్, వెల్లింగ్టన్, క్రైస్ట్‌చర్చ్, హామిల్టన్, డునెడిన్ ఈ జాబితాలో ఉన్నాయి.

### ఫైనల్ మ్యాచ్ కోసం పోటీ..

దశాబ్దాలుగా ఆస్ట్రేలియాలో జరిగే అన్ని ప్రధాన ప్రపంచ కప్ ఫైనల్స్‌కు మెల్బోర్న్ క్రికెట్ గ్రౌండ్ (వీజ+) వేదికగా నిలుస్తోంది. కానీ ఈసారి ఫైనల్‌కు వీజ+ ఆతిథ్యం ఇస్తుందనేది ఖాయం కాదని క్రికెట్ ఆస్ట్రేలియా సీఈఓ సూచించారు.

అడిలైడ్ ఓవల్‌లో ఫైనల్ నిర్వహించడానికి దక్షిణ ఆస్ట్రేలియా ప్రభుత్వం ఒక ఆర్థిక ప్రతిపాదనను సిద్ధం చేస్తుండగా, పశ్చిమ ఆస్ట్రేలియా, క్వీన్స్‌లాండ్ కూడా ప్రధాన మ్యాచ్‌ల కోసం పోటీ పడుతున్నాయి.

### కొత్త రకం టోర్నమెంట్..

2028 టీ20 ప్రపంచ కప్‌లో 20 జట్లు పాల్గొననున్నాయి. ఇందులో మొత్తం 55 మ్యాచ్‌లు జరుగుతాయి. ఈసారి ఐసీసీ టోర్నమెంట్ ఫార్మాట్‌ను పునరుద్ధరించి, ఐపీఎల్ తరహా 'ఎలిమినేటర్' మ్యాచ్‌లను ప్రవేశపెట్టింది. వాణిజ్య విలువ, ప్రసారకర్తల డిమాండ్, వాతావరణ పరిస్థితులు, ప్రభుత్వ మద్దతు ఆధారంగా 8-10 స్టేడియాల తుది జాబితాను ఐసీసీ త్వరలో ప్రకటించనుంది.

మొత్తం మీద, 2028 టీ20 ప్రపంచ కప్‌కు ఆతిథ్యం ఇచ్చే రేసు రోజురోజుకీ మరింత ఉత్సాహభరితంగా మారుతోంది. ఐసీసీ నిర్దేశించిన కఠినమైన ప్రమాణాలను దాటి, తుది జాబితాలో చోటు దక్కించుకునే ఆ 14 నగరాలలో వేటికి లక్ దక్కనుందోచూడాలి.

# మనోళ్లు దొరికిపోతున్నారు.. బౌండరీలు వెనక్కి జరపండి: గావస్కర్

స్వదేశంలో అదరగొట్టే భారత బ్యాటర్లు పెద్ద మైదానాలు ఉండే దేశాల్లో తడబడుతున్నారు. ఇటీవల ఐర్లాండ్, ఇంగ్లాండ్ పర్యటనల్లో ఇది స్పష్టంగా కనిపించింది. చిన్న బౌండరీలకు అలవాటు పడిన మన బ్యాటర్లు.. పెద్ద బౌండరీలు ఉన్న గ్రౌండ్లలో భారీ షాట్లు ఆడి బౌండరీ లైన్ వద్ద ఫీల్డర్లకు చిక్కి పెవిలియన్ చేరుతున్నారు. ఈ నేపథ్యంలో సునీల్ గవాస్కర్ బీసీసీఐకి కీలక సూచన చేశారు. కొత్త సీజన్‌లో మన మైదానాల్లో బౌండరీ లైన్లను వెనక్కి జరపాలన్నారు. "ఐపీఎల్‌లో ఫ్లాట్ పిచ్‌లు, చిన్న బౌండరీలపై అదరగొట్టిన భారత బ్యాటర్లు ఆ తర్వాత ఇంగ్లాండ్‌లో అలవాటు లేని పరిస్థితుల్లో ఇబ్బందులు పడ్డారు. భారత్‌లో ఫ్లాట్ పిచ్‌లు ఉన్న మాట నిజమే. చాలా చిన్నగా ఉండే బౌండరీలే బ్యాటర్లకు అనుకూలిస్తాయి. దాంతో వారు సరిగ్గా షాట్ కొట్టని బంతులు కూడా బౌండరీ దాటుతున్నాయి. అదే పెద్ద, పొడవైన బౌండరీలు ఉన్న దేశాల్లో అవే షాట్లు ఆడి బౌండరీ లైన్ లోపలే ఫీల్డర్లకు చిక్కుతున్నారు. వచ్చే ఏడాది జరగబోయే ప్రపంచ కప్‌నకు ముందు మన బ్యాటర్లు అలవాటు పడేందుకు కొత్త సీజన్ ప్రారంభమయ్యే సమయానికి బౌండరీల దూరం పెంచడం అత్యంత ఆవశ్యకం. దాదాపు ప్రతి మైదానంలోనూ ఎల్ఈడీ అడ్వర్టైజింగ్ బోర్డుల వెనుక ప్రజలు నడవడానికి తగినంత ఖాళీ స్థలం ఉంటుంది. ఆ స్థలాన్ని వినియోగించుకుని బౌండరీల పరిమాణం పెంచాలి" అని గవాస్కర్ సూచించారు.

# ఐపీఎల్ ఫ్రాంచైజీలు ఛీ కొట్టాయి.. బీసీసీఐ పిలుపుతో 33 ఏళ్ల వయసులో లక్కీ ఛాన్స్

**శ్రీలంక పర్యటనకు బీసీసీఐ ఎంపిక చేసిన 15 మంది సభ్యులతో కూడిన టెస్ట్ స్క్వాడ్‌లో ఎవరూ ఊహించని సరికొత్త మార్పు చోటుచేసుకుంది. స్టార్ ఆల్ రౌండర్ వాషింగ్టన్ సుందర్ గాయం బారిన పడి తొలి టెస్టుకు దూరం కావడంతో ఆ స్థానాన్ని భర్తీ చేసే అరుదైన అవకాశం సారాన్ష్ జైన్‌కు దక్కింది. దాదాపు పదేళ్లుగా మధ్యప్రదేశ్ జట్టుకు దేశవాళీ క్రికెట్లో చెమటోడుస్తున్న ఈ వెటరన్ ఆటగాడికి జీవితంలో ఇదే అతిపెద్ద బహుమతి. యువ ఆటగాళ్లతో నిండిన ప్రస్తుత భారత జట్టులో 33 ఏళ్ల వయసున్న ఓ దేశవాళీ ప్లేయర్‌కు స్థానం దక్కడం సాధారణ విషయం కాదు. ఈ వార్త బయటకు రాగానే అసలు ఈ సారాన్ష్ జైన్ ఎవరు, ఎక్కడి నుంచి వచ్చాడు అని నెటిజన్లు ఆసక్తిగా గూగుల్ చేయడం మొదలుపెట్టారు.**

2014లో దేశవాళీ క్రికెట్లోకి అడుగుపెట్టిన సారాన్ష్ జైన్‌కు ఆట పట్ల ఎనలేని అంకితభావం ఉంది. అప్పటినుంచి మధ్యప్రదేశ్ జట్టుకు ప్రధాన స్పిన్ ఆల్ రౌండర్‌గా అద్భుతమైన సేవలు అందిస్తున్నాడు. సెంట్రల్ జోన్, రెస్టాఫ్ ఇండియా జట్లకు సైతం ప్రాతినిధ్యం వహించిన సుదీర్ఘ అనుభవం అతడి సొంతం. ఫస్ట్ క్లాస్ క్రికెట్లో ఇప్పటి వరకు 181 వికెట్లు పడగొట్టడమే కాకుండా బ్యాట్‌తోనూ సత్తా చాటి 2223 పరుగులు సాధించాడు. లోయర్ ఆర్డర్‌లో బ్యాటింగ్‌కు దిగి జట్టుకు అవసరమైన కీలక పరుగులు రాబట్టడం ఇతని స్పెషాలిటీ. ప్రముఖ దేశవాళీ కోచ్ చంద్రకాంత్ పండిట్ మార్గదర్శకత్వంలో అతని ఆటతీరు పూర్తిగా పదునెక్కింది. 2022లో రంజీ ట్రోఫీ గెలిచిన మధ్యప్రదేశ్ జట్టులో సారాన్ష్ ఓ కీలక సభ్యుడు. ముంబైతో చెన్నై వేదికగా జరిగిన ఆ చారిత్రక ఫైనల్లో బంతితో రెండు వికెట్లు తీయడంతో పాటు బ్యాట్‌తో హాఫ్ సెంచరీ సాధించి అదరగొట్టాడు.

కొడుకు కోసం క్యాన్సర్ బాధను దిగమింగుకున్న తండ్రి..

సారాన్ష్ ఎదుగుదల వెనుక ఓ హృదయ విదారకమైన కన్నీటి గాథ దాగుంది. అతని తండ్రి సుబోధ్ జైన్ కూడా మాజీ క్రికెటరే కావడం విశేషం. మధ్యప్రదేశ్ తరపున తొమ్మిది రంజీ మ్యాచ్‌లు ఆడిన ఆయన రైట్ ఆర్మ్ ఆఫ్ బ్రేక్ బౌలర్. తానూ దేశం తరపున ఆడాలని ఆయన ఎన్నో కలలు కన్నాడు. ఆ కల నెరవేరకపోవడంతో తన కొడుకు ద్వారా దాన్ని సాకారం చేసుకోవాలనుకున్నాడు. కొడుకు కెరీర్ ఎక్కడ దెబ్బతింటుందో అని తన క్యాన్సర్ ఆపరేషన్ విషయాన్ని కూడా కొడుక్కి తెలియనివ్వకుండా జాగ్రత్త పడ్డాడు. 2014లో ఆస్ట్రేలియా పర్యటనలో ఉన్న సారాన్ష్ జైన్‌కు తన తండ్రి సర్జరీ విషయం కనీసం తెలియదు. తిరిగి వచ్చాకే తండ్రి ముఖానికి ఆపరేషన్ జరిగిందన్న నిజాన్ని జీర్ణించుకున్నాడు. ఈ విషయాన్ని స్వయంగా సారాన్ష్ ఓ ఇంటర్వ్యూలో పంచుకుని తీవ్ర భావోద్వేగానికి గురయ్యాడు.



### లంక గడ్డపైనే సత్తా చాటి.. ఐపీఎల్‌కు దిమ్మతిరిగే షాక్!

తాజాగా ఇండియా-ఏ తరపున శ్రీలంక పర్యటనకు వెళ్లిన సారాన్ష్ జైన్ తన సత్తా ఏంటో మరోసారి నిరూపించుకున్నాడు. శ్రీలంక-ఏతో జరిగిన రెండో అనధికారిక టెస్ట్ మ్యాచ్‌లో ఏకంగా 70 పరుగులు సాధించి, బంతితో ఆరు వికెట్లు పడగొట్టి సిరీస్ విజయంలో కీలక పాత్ర పోషించాడు. ఈ అద్భుతమైన ఆల్ రౌండ్ ప్రదర్శనతోనే జాతీయ సెలెక్టర్ల కంట్లో పడ్డాడు. ఆసక్తికరమైన విషయం ఏమిటంటే, దేశవాళీలో ఇంత అద్భుతంగా రాణిస్తున్నా ఐపీఎల్ ఫ్రాంచైజీలు ఇతడిని ఏమాత్రం పట్టించుకోలేదు. 2024 నుంచి 2026 వరకు ప్రతిసారి వేలంలో పేరు నమోదు చేసుకున్నా ఎవరూ కొనుగోలు చేయలేదు. డబ్బులు కురిపించే లీగ్‌లో చోటు దక్కలేదని కుంగిపోకుండా తన ఆటనే నమ్ముకుని కష్టపడ్డాడు. ఐపీఎల్ దయాదాక్షిణ్యాలతో పనిలేకుండా కేవలం దేశవాళీ ప్రదర్శన ఆధారంగానే భారత జట్టులోకి అడుగుపెట్టిన అరుదైన ఆటగాడిగా సారాన్ష్ జైన్ సరికొత్త చరిత్ర సృష్టించాడు.

ఆలస్యంగానైనా 33 ఏళ్ల వయసులో జాతీయ జట్టు తలుపులు తట్టడం ఓ అద్భుతమైన స్ఫూర్తిదాయక ప్రయాణం. నిజాయితీగా కష్టపడితే వయసుతో సంబంధం లేకుండా గుర్తింపు వస్తుందని సారాన్ష్ జైన్ ఎందరో యువ క్రీడాకారులకు ఆదర్శంగా నిలిచాడు. శ్రీలంక గడ్డపై జరగనున్న ఈ సిరీస్‌లో అతను మైదానంలోకి దిగి ఎలా అదరగొడతాడో చూడాలని క్రికెట్ అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

CINIMA NEWS
https://epaper.teluguraastram.com
తెలుగురాష్ట్రం దినపత్రిక

# రీఎంట్రీకి ఇది సరైన సినిమా అనిపించింది: వరుణ్ తేజ్




గత రెండేళ్లుగా వెండితెరకు దూరంగా ఉండటంపై కథానాయకుడు వరుణ్ తేజ్ స్పష్టతనిచ్చారు. ఇది బలవంతంగా తీసుకున్న విరామం కాదని, భవిష్యత్తులో ఎటువంటి పాత్రలు పోషించాలనే అంశంపై స్పష్టత తెచ్చుకోవడం కోసమే ఈ విరామం తీసుకున్నానని ఆయన తెలిపారు. మేర్లపాక గాంధీ దర్శకత్వంలో తాను నటిస్తున్న ఇండో-కొరియన్ హారర్ కామెడీ చిత్రం 'కొరియన్ కనకరాజు'తో ఆయన త్వరలో ప్రేక్షకుల ముందుకు రానున్నారు. తాజాగా ఒక ఇంటర్వ్యూలో వరుణ్ తేజ్ మాట్లాడుతూ, "కేవలం విరామం తీసుకోవాలనే ఉద్దేశంతో నేను సినిమాలకు దూరం కాలేదు. ఎటువంటి పాత్రలు చేయాలనే విషయంపై నాకు పూర్తి స్పష్టత కావాలి. మొక్కుబడిగా సినిమాలు చేయడం నాకు ఇష్టం ఉండదు. కథను పూర్తిగా నమ్మినప్పుడే ప్రాజెక్టుకు అంగీకరిస్తాను" అని వివరించారు. ఈ క్రమంలోనే దర్శకుడు గాంధీ వినిపించిన 'కొరియన్ కనకరాజు' కథ ఎంతో వైవిధ్యంగా అనిపించిందని, సుదీర్ఘ విరామం తర్వాత పునరాగమనానికి ఇది సరైన చిత్రమని భావించి గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు పేర్కొన్నారు. చిత్ర విశేషాలను పంచుకుంటూ, "ఇది ఇండో-కొరియన్ నేపథ్యంలో సాగే హారర్ కామెడీ చిత్రం. తెలుగు చలనచిత్ర పరిశ్రమలో ఇప్పటివరకు ఎవరూ ఇటువంటి జోనర్‌ను ప్రయత్నించలేదు. అందుకే ఈ కథ వినగానే వెంటనే అంగీకరించాను" అని తెలిపారు. ఇందులో తన పాత్ర పేరు కనకరాజు అని, తన నిజ జీవిత వ్యక్తిత్వానికి పూర్తి భిన్నంగా సాగే ఈ పాత్ర ప్రేక్షకులను విశేషంగా అలరిస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఈ పాత్ర కోసం తాను చేసిన కసరత్తులను వరుణ్ వెల్లడించారు. రాయలసీమ యాస నేర్చుకోవడంతో పాటు, కొరియన్ భాషలో సుదీర్ఘ సంభాషణలు పలకడం, విభిన్నమైన లుక్ కోసం జుట్టు పెంచడం మరియు నృత్యాలపై ప్రత్యేక శ్రద్ధ వహించడం వంటివి చేశానని పేర్కొన్నారు. ఈ చిత్రంలో వరుణ్ తేజ్ సరసన రితికా నాయక్ కథానాయికగా నటిస్తోంది. ఎంతో ఆసక్తిని రేకెత్తిస్తున్న 'కొరియన్ కనకరాజు' చిత్రం ఆగస్టు 7న థియేటర్లలో విడుదల కానుంది.

## ధనుష్ 'ఓం' నుంచి మాస్ జాతర.. ఫస్ట్ సింగిల్ 'అలాకా లూవా' వచ్చేసింది!




జాతీయ అవార్డు గ్రహీత, విలక్షణ నటుడు ధనుష్ నటిస్తున్న 55వ చిత్రం 'ఓం'. అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఈ సినిమా నుంచి తాజాగా తొలి పాట విడుదలైంది. 'అలాకా లూవా' పేరుతో వచ్చిన ఈ ఫస్ట్ సింగిల్, సోషల్ మీడియాలో ట్రెండ్ అవుతోంది. మాస్ బీట్స్, ఎనర్జిటిక్ వోకల్స్‌తో పూర్తిస్థాయి సెలబ్రేషన్ ఆంథమ్‌గా ఈ పాటను తీర్చిదిద్దారు. సంగీత సంచలనం సాయి అభ్యంకర్ ఈ పాటకు స్వరాలు సమకూర్చడమే కాకుండా, స్వయంగా ఆలపించారు. తెలుగు వెర్షన్‌కు ప్రముఖ గాయకులు రామ్ మిరియాల, అరుణ్ కౌండిన్య గొంతు కలపగా, స్టార్ లిరిసిస్ట్ చంద్రబోస్ సాహిత్యం అందించారు. ఈ పాటలో ధనుష్ ఎనర్జిటిక్ డ్యాన్స్ మూమెంట్స్ ప్రేక్షకులను కట్టిపడేసేలా ఉన్నాయి. ఇటీవలే ఈ చిత్రానికి సంబంధించి విడుదలైన 'ఫస్ట్ స్ట్రైక్' టైటిల్ టీజర్ కూడా విశేషమైన స్పందన రాబట్టుకుంది. 'ఓం -- చాప్టర్ 1: ఉధిరమ్-ది బ్లడ్ వుడ్' అనే పూర్తి టైటిల్‌తో వచ్చిన ఈ టీజర్, సినిమా ఎంతటి తీవ్రమైన యాక్షన్ థ్రిల్లర్‌గా ఉండబోతోందో స్పష్టం చేసింది. ఇందులో ధనుష్ మాస్ అవతార్ అభిమానులను ఆకట్టుకుంది. ఈ చిత్రంలో తారాగణం సినిమాపై అంచనాలను అమాంతం పెంచేసింది. ఇందులో మలయాళ మెగాస్టార్ మమ్ముట్టి ఒక శక్తివంతమైన పాత్రలో నటిస్తున్నారు. 'మారి 2' తర్వాత ధనుష్, సాయి పల్లవి మరోసారి ఈ సినిమాతో జతకడుతుండగా, యువతలో క్రేజ్ ఉన్న శ్రీలీల కూడా కీలక పాత్రలో కనిపించనుంది. 'అమరన్' వంటి బ్లాక్‌బస్టర్ విజయం తర్వాత దర్శకుడు రాజ్‌కుమార్ పెరియసామి ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. ధనుష్ సొంత నిర్మాణ సంస్థ వండర్‌బార్ ఫిల్మ్స్, ఆర్-టేక్ స్టూడియోస్ సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నాయి. ప్రపంచవ్యాప్తంగా 2026 అక్టోబర్ 16న విజయదశమి కానుకగా ఈ చిత్రం థియేటర్లలోకి రానుంది. భారీ తారాగణం, అద్భుతమైన సాంకేతిక బృందంతో వస్తున్న 'ఓం' చిత్రంపై ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి.

## 'శ్రీనివాస మంగాపురం' రన్ టైమ్ ఇదే!




ఒక సినిమా కథలో దర్శకుడికి ఎంత నమ్మకం, స్పష్టత ఉన్నాయో చెప్పడానికి ఆ చిత్ర నిడివి కూడా ఒక నిదర్శనంగా నిలుస్తుంది. తాజాగా, దర్శకుడు అజయ్ భూపతి తన కొత్త చిత్రం 'శ్రీనివాస మంగాపురం' రన్‌టైమ్‌ను అధికారికంగా ప్రకటించారు. ఈ సినిమా 2 గంటల 35 నిమిషాల నిడివితో ప్రేక్షకులను పలకరించనుంది. "సీజన్‌లోనే అత్యంత గాఢమైన ప్రేమకథ" అని ప్రచారం చేస్తున్న ఈ చిత్రానికి ఇంత నిడివిని లాక్ చేయడం, కథపై యూనిట్‌కు ఉన్న గట్టి నమ్మకాన్ని తెలియజేస్తోందని ఇండస్ట్రీ వర్గాలు భావిస్తున్నాయి. '=శ 100' చిత్రంతో టాలీవుడ్‌లో సంచలనం సృష్టించి, తనకంటూ ఒక ప్రత్యేకమైన బ్రాండ్ క్రియేట్ చేసుకున్న దర్శకుడు అజయ్ భూపతి ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. ఆయన చిత్రాలంటేనే రా, రస్టిక్ భావోద్వేగాలకు పెట్టింది పేరు. ఇప్పుడు పూర్తిస్థాయి ప్రేమకథతో వస్తుండటంతో సినిమాపై అంచనాలు భారీగా ఉన్నాయి. ఈ చిత్రంతో ఘట్టమనేని కుటుంబం నుంచి జైకృష్ణ హీరోగా తెలుగు తెరకు పరిచయం కానుండటం మరో ప్రధాన ఆకర్షణ. ఇదే సినిమాతో బాలీవుడ్ భామ రవీనా టాండన్ కుమార్తె రాషా థడానీ కూడా టాలీవుడ్ అరంగేట్రం చేస్తోంది. ఇప్పటికే విడుదలైన అప్ డేట్స్ ద్వారా జయకృష్ణ ఘట్టమనేని, రాషా కెమిస్ట్రీ అందరినీ ఆకట్టుకుంటోంది. ఇందులో సీనియర్ నటుడు మోహన్ బాబు పవర్ ఫుల్ రోల్ లో కనిపించనున్నారు. టాలీవుడ్ లెజెండరీ నిర్మాత, వైజయంతీ మూవీస్ అధినేత సి. అశ్వనీదత్ ఈ చిత్రాన్ని సమర్పిస్తుండటం సినిమా స్థాయిని పెంచుతోంది. చందమామ కథలు పిక్చర్స్ ఎల్ఎల్‌పి పతాకంపై పి. కిరణ్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. భావోద్వేగభరితమైన కథలకు తన సంగీతంతో ప్రాణం పోసే ప్రముఖ సంగీత దర్శకుడు జి.వి. ప్రకాశ్ కుమార్ ఈ సినిమాకు స్వరాలు సమకూర్చారు. అజయ్ భూపతి మార్క్ టేకింగ్, ఘట్టమనేని వారసుడి అరంగేట్రం, అశ్వనీదత్ సమర్పణ వంటి బలమైన అంశాలతో వస్తున్న 'శ్రీనివాస మంగాపురం' చిత్రాన్ని జూలై 30న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేసేందుకు నిర్మాతలు సన్నాహాలు చేస్తున్నారు.

## ప్రముఖ నటి పావలా శ్యామల ఇకలేరు..



తెలుగు సినీ పరిశ్రమలో ఎన్నో విభిన్న పాత్రలతో ప్రేక్షకులను అలరించిన ప్రముఖ సీనియర్ నటి పవళ శ్యామల కన్నుమూశారు దింతో టాలీవుడ్‌లో తీవ్ర విషాదం నెలకొంది. గత కొంతకాలంగా తీవ్ర అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ఆమె, హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ అర్ధరాత్రి గుండెపోటుతో తుదిశ్వాస విడిచారు. గుంటూరు జిల్లా అమరావతిలో జన్మించిన ఆమె నాటక రంగం ద్వారా తన నట ప్రయాణాన్ని ప్రారంభించి, ఆ తర్వాత వెండితెరకు పరిచయమయ్యారు. దర్శకుడు కే విశ్వనాథ్ స్వర్ణకమలం సినిమాతో పాటు ఖడ్గం, ఆంధ్రావాలా, వర్షం వంటి చిత్రాల్లో ఆమె పోషించిన పాత్రలు ప్రేక్షకుల మదిలో నిలిచిపోయాయి. ఆంధ్రావాలా చిత్రంలో చేసిన పావలా పాత్ర ద్వారా ఆమెకు ప్రత్యేకమైన గుర్తింపు రావడంతో పాటు అందరూ ఆ పేరుతోనే పిలవడం మొదలుపెట్టారు. నాలుగు దశాబ్దాల సినీ ప్రయాణంలో దాదాపు మూడు వందలకు పైగా సినిమాలలో నటించి తనకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్నారు. వెండితెరపై ఎంతోమంది నటీనటులతో కలిసి నవ్వులు పంచుతూ అద్భుతమైన అభినయం ప్రదర్శించిన ఆమె నిజ జీవితంలో మాత్రం అనేక కష్టాలను ఎదుర్కొన్నారు. వృద్ధాప్యం పెరుగుతున్న కొద్ది కాలక్రమేణా ఆమె తీవ్ర ఆర్థిక ఇబ్బందులతో పాటు అనారోగ్య సమస్యలను ఎదుర్కోవాల్సి వచ్చింది. గుండె సంబంధిత వ్యాధులు, పార్కిన్సన్స్ మరియు హైబీపీ వంటి అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ఆమెకు సరైన సమయంలో సరైన వైద్యం అందక ఇబ్బంది పడ్డారు. గతంలో ఆమె పడిన కష్టాలను చూసి తెలుగు చిత్ర పరిశ్రమకు చెందిన ప్రముఖ నటులు పవన్ కళ్యాణ్, చిరంజీవి, అల్లు అర్జున్ మరియు దిల్రాజు వంటి వారు ముందుకు వచ్చి ఆర్థిక సహాయం అందించారు. అయినప్పటికీ ఆరోగ్యం పూర్తిగా క్షీణించడంతో పాటు వయసురీత్యా వచ్చిన సమస్యల కారణంగా ఆమె తుదిశ్వాస విడిచారు. ఆమె పడిన కష్టాలు మరియు చివరి దశలో ఎదుర్కొన్న పరిస్థితులు తెలుగు సినీ పరిశ్రమలో ఎప్పుడూ చర్చనీయాంశంగానే ఉండిపోయాయి.

**ఉస్మానియా ఆసుపత్రిలో తుదిశ్వాస విడిచిన సీనియర్ నటి**

తెలుగు చలనచిత్ర పరిశ్రమలో సహాయ నటిగా మరియు హాస్య నటిగా తనకంటూ ఒక ప్రత్యేకమైన గుర్తింపు తెచ్చుకున్న ఆమె మృతితో ఇండస్ట్రీలో పెద్ద శూన్యత ఏర్పడింది. నటిగా అంకితభావంతో పని చేసిన ఆమె చివరి రోజుల్లో ఆశ్రయం లేక ఇబ్బందులు పడినప్పుడు కొందరు అధికారులు మరియు సిబ్బంది స్పందించి ఆసుపత్రిలో చేర్పించారు. ఆమె మరణ వార్త తెలిసిన వెంటనే పలువురు సినీ ప్రముఖులు సోషల్ మీడియా వేదికగా సంతాపం ప్రకటించి ఆమె కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఒకప్పుడు వెండితెరపై నవ్వులు పంచిన గొప్ప నటి నేడు మన మధ్య లేకపోవడం తెలుగు ప్రేక్షకులను మరియు సినీ అభిమానులను తీవ్రంగా కలచివేసింది. ఆమె చేసిన అద్భుతమైన పాత్రలు మరియు చిత్ర పరిశ్రమకు అందించిన సేవలు ఎప్పటికీ చిరస్మరణీయంగా నిలిచిపోతాయి.

## లవ్ స్టోరీలు అంటే పిచ్చి- చైతు



కిరణ్ అబ్బవరం, శ్రీ గౌరి ప్రియ కాంబినేషన్‌లో వచ్చిన చిత్రం 'చెన్నై లవ్ స్టోరీ'. విడుదలైన కేవలం మూడు రోజుల్లోనే ఈ సినిమా ప్రపంచవ్యాప్తంగా రూ. 40.1 కోట్ల గ్రాస్ వసూలు చేసి బాక్సాఫీస్ వద్ద ఘన విజయాన్ని సాధించింది. ఈ భారీ విజయాన్ని పురస్కరించుకుని చిత్ర యూనిట్ గ్రాండ్ సక్సెస్ మీట్‌ను నిర్వహించింది. ఈ వేడుకకు యువ సమ్రాట్ అక్కినేని నాగచైతన్య ముఖ్య అతిథిగా హాజరై చిత్ర బృందానికి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తనకు లవ్ స్టోరీలంటే ఎంతో ఇష్టమని, ఈ సినిమా విజయం చూస్తుంటే తన సొంత సినిమా గెలిచినంత సంతోషంగా ఉందని వ్యక్తపరిచారు.

**కోవిడ్ తర్వాత ఇండస్ట్రీకి దక్కిన కల్ట్ లవ్ స్టోరీ!**

ఈ కార్యక్రమంలో నాగచైతన్య మాట్లాడుతూ.. "కోవిడ్ మహమ్మారి తర్వాత టాలీవుడ్ ఇండస్ట్రీకి ఒక మంచి కల్ట్, మెచ్యూర్డ్ లవ్ స్టోరీ దక్కింది. ప్రేమకథలను తెరకెక్కించడంలో ఉన్న నిజాయితీ ఈ చిత్రంలో స్పష్టంగా కనిపిస్తోంది" అని కొనియాడారు. స్వయంకృషితో, ఎలాంటి బ్యాక్‌గ్రౌండ్ లేకుండా ఇండస్ట్రీలో కష్టపడి పైకొచ్చిన కిరణ్ అబ్బవరం నటనను చైతన్య ప్రత్యేకంగా ప్రశంసించారు. అలాగే హీరోయిన్ శ్రీ గౌరి ప్రియ తన అద్భుతమైన అభినయంతో ఆకట్టుకుందని, వీరిద్దరి కెమిస్ట్రీ సినిమాకు ప్రధాన బలమని అన్నారు. చిత్ర యూనిట్ ప్యాషన్, దర్శకనిర్మాతల సమష్టి కృషి వల్లనే ఈ స్థాయిలో కలెక్షన్లు రాబట్టడం సాధ్యమైందని కొనియాడారు.

# శృతి హాసన్ కెరీర్‌కు ఏమైంది..?



: స్టార్ హీరోయిన్ శృతి హాసన్ గత కొంతకాలంగా కొత్త సినిమాల విషయంలో నెమ్మదిగా అడుగులు వేస్తుండటంతో ఆమె కెరీర్‌పై అభిమానుల్లో ఆసక్తికరమైన చర్చ జరుగుతోంది. ఒకప్పుడు టాలీవుడ్, కోలీవుడ్, బాలీవుడ్‌లో వరుస అవకాశాలతో బిజీగా కనిపించిన శృతి ఇప్పుడు మాత్రం కథకు ప్రాధాన్యం ఉన్న ప్రాజెక్టులనే ఎంపిక చేసుకుంటోంది. దీంతో ఆమె కెరీర్‌కు ఏమైందనే ప్రశ్న తరచూ వినిపిస్తోంది.

శృతి హాసన్ చివరిసారిగా తెలుగు ప్రేక్షకులను సలార్ 1 సీజ్‌ఫైర్ సినిమాలో హీరోయిన్‌గా అలరించింది. ప్రభాస్ సరసన ఆమె పోషించిన ఆద్య పాత్రకు మంచి స్పందన లభించింది. ఆ తర్వాత విడుదలైన రజనీకాంత్ కూలీ చిత్రంలో కీలక పాత్రలో కనిపించి ప్రేక్షకులను ఆకట్టుకుంది. సినిమా విజయంలో ఆమె పాత్రకు కూడా మంచి గుర్తింపు వచ్చింది. ఇక తాజాగా రామ్ చరణ్ హీరోగా తెరకెక్కిన పెద్ది సినిమాలో శృతి హాసన్ చేసిన స్పెషల్ సాంగ్ ప్రేక్షకుల నుంచి మంచి ఆదరణ పొందింది. చాలా కాలం తర్వాత ఆమె చేసిన ఈ ప్రత్యేక గీతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారడంతో పాటు సినిమాకు కూడా అదనపు ఆకర్షణగా నిలిచింది. దీంతో శృతి స్క్రీన్ ప్రెజెన్స్ ఇప్పటికీ ఏమాత్రం తగ్గలేదని అభిమానులు అభిప్రాయపడుతున్నారు. అయితే ప్రస్తుతం ఆమె నుంచి కొత్త సినిమా ప్రకటనలు పెద్దగా లేకపోవడంతో తదుపరి ప్రాజెక్ట్ ఏంటనే ఆసక్తి నెలకొంది. సినీ వర్గాల సమాచారం ప్రకారం శృతి పలు కథలు వింటున్నప్పటికీ, ఇంకా ఏ కొత్త చిత్రాన్ని అధికారికంగా ప్రకటించలేదు. త్వరలోనే ఓ భారీ పాన్ ఇండియా ప్రాజెక్ట్‌కు గ్రీన్ సిగ్నల్ ఇచ్చే అవకాశముందని ప్రచారం జరుగుతోంది. నటిగా మాత్రమే కాకుండా సంగీత రంగంలో కూడా శృతి హాసన్ తన ప్రయాణాన్ని కొనసాగిస్తోంది. అందుకే సినిమాల సంఖ్య తగ్గినప్పటికీ ఆమె క్రేజ్ మాత్రం ఏమాత్రం తగ్గలేదు. సరైన కథ దొరికితే మరోసారి వరుస సినిమాలతో ప్రేక్షకుల ముందుకు రావడం ఖాయమని అభిమానులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

## ఫ్యాన్స్‌తో అల్లు అర్జున్ గ్రాండ్ మీట్




పాన్ ఇండియా ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ హైదరాబాద్‌లో తన అభిమానులతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. యూసుఫ్‌గూడలోని శౌర్య భవన్‌లో 'అల్లు అర్జున్ ఫ్యాన్స్ అసోసియేషన్' (ఆఫా) ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమం అత్యంత వైభవంగా, ఉత్సాహభరితంగా సాగింది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణతో పాటు దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన సుమారు 600 మందికి పైగా అభిమానులు ఈ వేడుకలో పాల్గొని తమ అభిమాన హీరోను కలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడిన అల్లు అర్జున్... సోషల్ మీడియాలో వ్యక్తమయ్యే అనవసరపు ట్రోల్స్, నెగెటివిటీపై పరోక్షంగా స్పందిస్తూ అభిమానులకు దిశానిర్దేశం చేశారు. నెట్టింట సాగే దుష్ప్రచారాలను, వివాదాలను అస్సలు పట్టించుకోవద్దని స్పష్టం చేశారు. సానుకూల ధోరణితో (పాజిటివ్ యాటిట్యూడ్) ముందుకెళుతూ, తమ సమయాన్ని, శక్తిని సమాజానికి ఉపయోగపడే మంచి కార్యాలకే వినియోగించాలని పిలుపునిచ్చారు. తనపై ఎనలేని ప్రేమను చూపుతున్న అభిమానుల ఆప్యాయతకు బన్నీ ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. అనంతరం వచ్చిన వారందరితో ఓపిగ్గా గ్రూప్ ఫొటోలు దిగుతూ ఎంతో ఆత్మీయంగా గడిపారు. నెగెటివిటీకి దూరంగా ఉండాలని అల్లు అర్జున్ ఇచ్చిన సందేశంపై సోషల్ మీడియాలోనూ నెటిజన్ల నుంచి విశేష ప్రశంసలు దక్కుతున్నాయి. ఈ ప్రత్యేక సమావేశంతో ఐకాన్ స్టార్‌కు, ఆయన అభిమానులకు మధ్య ఉన్న బంధం మరింత బలపడింది.

TELUGU RASTRAM . Printed, Published and Owned by A.RAJASEKHAR. Printed at Ajay Sri Printers, D.No. 4/151, Aithabathulavari centre, S.Yanam, Uppalaguptam Mandal, Dr B.R. ambedkar konaseema Dist, A.P Published at D.No. 4-151, Aithabathulavari Centre, S.Yanam, Uppalaguptam Mandal, Dr B.R. ambedkar konaseema Dist, A.P. Editor: A.RAJASEKHAR, . RNI NO. APTEL/2016/66202, email: telugurastram2016@gmail.com, Phone No. 8074368339